# ప్రజాశక్తి

బుధవారం 1 జనవరి 2025 8 పేజీలు




గుంటూరు



పల్నాడు




గుంటూరులోని ఓ బేకరీ వద్ద కేక్ విక్రయాలు

# హ్యాపీ న్యూ ఇయర్!

- ఉత్సాహంగా కొత్తసంవత్సరం వేడుకలు
- దుకాణాలు, వ్యాపార సంస్థలు కిటకిట
- విద్యా సంస్థలు, హోటళ్లు, కార్యాలయాల్లో సందడి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు, పల్నాడు జిల్లాల్లో నూతన సంవత్సర వేడుకలు మంగళవారం సాయంత్రం నుంచి ఉత్సాహంగా ప్రారంభం అయ్యాయి. అర్ధరాత్రి దాటే వరకు వేడుకలు కొనసాగాయి. విద్యా సంస్థలు, పలు ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల్లో ముందస్తు వేడుకలు నిర్వహించారు. కొన్ని పాఠశాలలకు సెలవు ప్రకటించడంతో చాలాచోట్ల మంగళవారమే వేడుకలు జరిగాయి. విద్యా సంస్థలు, హోటళ్లలో పలువురు కల్చరల్ కార్యక్రమాలు నిర్వహించారు. రాత్రి 8 గంటల నుంచి ఒంటి గంట వరకు హోటళ్లు, ఫంక్షను హాల్స్, విద్యా సంస్థలు, అతిథి గృహాలు, క్లబ్బుల్లో పెద్ద ఎత్తున వేడుకలను నిర్వహించారు. యువత ఉత్సాహంగా ఉల్లాసంగా వేడుకల్లో పాల్గొన్నారు. సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు రహదా రులన్నీ కిటకిటలాడాయి.

నూతన సంవత్సరం సందర్భంగా ప్రత్యేకంగా స్టాల్స్ ఏర్పాటు చేశారు. కేకులు, స్వీట్స్, పండ్లు, బహమతులు, బొకేలు, విక్రయాలు భారీగా జరిగాయి. గుంటూరుతో పాటు నర్సరావుపేట, చిలకలూరిపేట, సత్తెనపల్లి, తెనాలి, పొన్నూరు, మంగళగిరి, తాడేపల్లి తదితర పట్టణాల్లో కూడా ప్రత్యేక స్టాల్స్ ఏర్పాటు చేసి వ్యాపారులు కొనుగోలు దారులను ఆకర్షించారు. బేకరీలు, బొకేలు, పూలు, పండ్ల, వస్త్ర దుకాణాలు కిటకిటలాడాయి. ఈసారి ప్రజా ప్రతినిధులు, రాజకీయ ప్రముఖులు బొకేలు, పూలదండలు తీసుకురావద్దని,

▶ 2లో

# పల్నాడుకు సిఎం వరాలు

- వరికపూడిసెలకు తక్షణం రూ.14 కోట్లు ఇస్తాం
- పిడుగురాళ్ల మెడికల్ కళాశాలకు త్వరలో నిధులు
- లెదర్ పార్కు ఏర్పాటుకు చర్యలు
- రౌడీయిజం చేస్తే తాటతీస్తాం
- యలమంద సభలో చంద్రబాబు



సభలో మాట్లాడుతున్న చంద్రబాబు.. మహిళకు మంజూరు పత్రాలు అందిస్తున్న ముఖ్యమంత్రి (ఇన్‌సెట్)

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

పల్నాడు జిల్లాకు సిఎం చంద్రబాబు పలు వరాలు ప్రకటించారు. పింఛన్ల పంపిణీ కోసం నరసరావుపట మండలంలోని యలమంద గ్రామానికి మంగళవారం వచ్చిన ఆయన నరసరావుపేట ఎంపి లావు శ్రీకృష్ణదేవరాయులు, ఎమ్మెల్యే అరవిందబాబు విజ్ఞప్తి మేరకు పలు హామీలిచ్చారు. వరికపూడిసెల ప్రాజెక్టు పనులు త్వరలోనే ప్రారంభించుకునేందుకు చర్యలు తీసుకుంటున్నామని, అటవీశాఖకు చెల్లించాల్సిన నిధులు రూ.14 కోట్లు ఇస్తామని అన్నారు. నిర్మాణంలో ఉన్న పిడుగురాళ్లలో మెడికల్ కాలేజీని 2025 సంవత్సరంలో ప్రారంభించుకునేందుకు శ్రీకారం చుడతామని తెలిపారు. రూ.250 కోట్లు అవసరం అవుతాయని, ఈ విషయంలో త్వరలో విధానపరమైన నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. పల్నాడు జిల్లాలో లెదర్ పార్క్ ఏర్పాటుకు శ్రీకారం చూడతామన్నారు. యలమంద గ్రామంలో దేవాలయం కళ్యాణ మండపానికి, గ్రామ అభివృద్ధికి ప్రభుత్వం సహకారం తప్పకుండా ఉంటుందన్నారు. పల్నాడు జిల్లాలో ఇంటింటికి తాగునీటి సౌకర్యం కల్పించేందుకు వాటర్ గ్రిడ్ పథకం అమలు చేస్తామన్నారు. గోదావరి, పెన్నా నదుల అనుసంధానం పథకం త్వరలో చేపడతామన్నారు. పల్నాడులో రైతులకు అవసరమైన యంత్రాలు సరఫరా చేస్తామన్నారు. రాయలసీమలో ఫ్యాక్షన్ తగ్గినా ఈ ప్రాంతంలో తగ్గడం లేదని, పల్నాడులో హింసపోవాలని, అభివృద్ధి జరగాలని అన్నారు. మాచర్లకు తాను కూడా రాలేకపోయానని, ఇక్కడ ఎంత దుర్మార్గులున్నారో వారి సంగతి తేలుస్తామని అన్నారు. రౌడీయిజం చేస్తే తాటతీస్తామన్నారు. అసభ్యంగా, వ్యక్తిత్వ హననం చేసే విధంగా సోషల్ మీడియాలో పోస్టింగ్స్ పెట్టే వారికి సంగతి తేలుస్తామన్నారు. అంతకు ముందు ఎంపి లావు శ్రీకృష్ణ దేవరాయులు మాట్లాడుతూ తాగు, సాగునీరు సమస్యను పరిష్కరించేందుకు వరికెపూడిసెల ప్రాజెక్టుకు నిధులు సమాకూర్చి పూర్తి చేయాలని, వాటర్ గ్రిడ్ చేపట్టాలని, గోదావరి - పెన్నా నదుల అనుసంధాన ప్రాజెక్టుకు చర్యలు తీసుకోవాలని, లెదర్ పార్క్‌ను పల్నాడుకు మంజూరు చేయాలని, పిడుగురాళ్ల మెడికల్ కాలేజీకి రూ.250 కోట్లు మంజూరు చేసి నిర్మాణాన్ని పూర్తి చేయాలని కోరారు. రైతులకు వీలుగా సబ్సిడీల్లో ట్రాక్టర్లు, తైవాన్ ఇంజన్లు అందజేయాలని కోరారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ఇచ్చే 93 పథకాలు గతంలో నిర్వీర్యం అయ్యాయని, గడిచిన ఆరు నెలల్లోని సీఎం చంద్రబాబు 72 పథకాలను పున: ప్రారంభించారని తెలిపారు.

## ఇళ్ల వద్దే పింఛన్లు ఇవ్వకుంటే మెమోలు

- నదుల అనుసంధానంతో నీటి కొరత లేకుండా చర్యలు
- 75 శాతం పాలనను గాడిలో పెట్టాం
- యలమంద పింఛన్ల పంపిణీ సభలో సిఎం చంద్రబాబు

2లో

## ఫ్లోర్‌బాల్ ఛాంపియన్లుగా బీహార్, తమిళనాడు జట్లు 4లో

## భారీగా అక్రమ మద్యం స్వాధీనం 2లో

# విద్యుత్ ప్రైవేటీకరణను విరమించుకోవాలి

- సిఐటియు జాతీయ ఉపాధ్యక్షులు ఆర్.లక్ష్మయ్య - విద్యుత్ కార్యాలయాల వద్ద నిరసనలు
- చండీఘర్ డిస్కం, ఉత్తరప్రదేశ్ విద్యుత్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాటానికి సంఘీభావం

ప్రజాశక్తి-గుంటూరు, పల్నాడు జిల్లా

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యుత్ ప్రైవేటీకరణ విధానాలు ఉపసంహరించు కోవాలని, రాష్ట్రంలో అదానీతో చేసుకున్న ఒప్పందాలను రద్దు చేసుకోవాలని సిఐటియు జాతీయ ఉపాధ్యక్షులు ఆర్.లక్ష్మయ్య డిమాండ్ చేశారు. చండీఘర్ డిస్కం, ఉత్తరప్రదేశ్ విద్యుత్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జరుగుతున్న ఉద్యోగ కార్మికుల పోరాటానికి సంఘీబావంగా, అదానీతో ఒప్పందాలను రద్దు చేసుకోవాలని కోరుతూ మంగళవారం గుంటూరులోని పొన్నూరు రోడ్డులో ఉన్న విద్యుత్ భవన్ ఎదుట, పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని విద్యుత్ కార్యాలయం నిరసనలు తెలిపారు. గుంటూరులో సిఐటియు నాయకులు బి.లక్ష్మణరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆర్.లక్ష్మయ్య మాట్లాడుతూ గత నాలుగేళ్లుగా చండీఘర్‌లో విద్యుత్ ప్రైవేట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఆందోళన జరుగుతోందన్నారు. లాభాల బాటలో నడుస్తున్న డిస్కమ్‌ను ప్రైవేటీకరించేందుకు కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం కంకణం కట్టుకుందని విమర్శించారు. గతంలో జమ్మూ కాశ్మీర్‌లో ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున పోరాడి వెనక్కి కొట్టారని, ఇప్పుడు చండీఘర్‌తో పాటు, యుూపి, తెలంగాణ, హర్యానా, హిమాచల్‌ప్రదేశ్ వంటి

▶ 2లో




గుంటూరు, నరసరావుపేటలో నిరసన తెలుపుతున్న సిఐటియు





## హ్యాపీ న్యూ ఇయర్!

(మొదటి పేజీ తరువాయి)

విద్యార్థులకు ఉపయోగపడే పెన్నులు, మొక్కలు తీసుకురావాలని సూచించారు. దీంతో బోకేల విక్రయాలు కొంత మేరకు తగ్గాయి. అంతేగాక వీటి ధరలు కూడా భారీగా ఉండటం వల్ల ఎక్కువ మంది పుస్తకాలు, స్వీట్ బాక్సులు, డెయిరీల కొనుగోలుకు ఆసక్తి చూపారు. పట్టణాలతో పాటు మండల కేంద్రాల్లో కూడా పెద్ద సంఖ్యలో ఈ దుకాణాలు వెలిశాయి. రహదారుల పక్కన మిఠాయిలు, కేకులు, కూల్‌డ్రింక్స్, పండ్లు, ఫలాలు, బొకేలు, పూలదండలు విక్రయించే స్టాల్స్‌కి సాయంత్రం నుంచి రాత్రి వరకు రద్దీ కొనసాగింది.

చర్చీలు, ఆలయాల వద్ద రద్దీ పెరిగింది. రాత్రి 12 గంటల వరకు ప్రార్థనలు నిర్వహించారు. ఆలయాల్లో అర్చనలు, ప్రత్యేక దర్శనాలు ఏర్పాటు చేశారు. రాత్రి 10 గంటల నుంచి పోలీసులు రోడ్లపైకి వచ్చి ట్రాఫిక్‌ను నియంత్రిస్తూ వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరిస్తున్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు తమ సహచర అధికారులు, సిబ్బందితో కలసి ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. వేడుకలు సందర్భంగా ప్రభుత్వ, ప్రయివేటు కార్యాలయాలు, చర్చిలు, ఆలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. యువత అదుపు తప్పకుండా పోలీసులు కూడలి ప్రదేశాల్లో పికెట్లు ఏర్పాటుతోపాటు పెట్రోలింగ్ నిర్వహించారు. మహిళలు, యువతుల రంగవల్లులతో ఆలంకరణలో ఉత్సాహంగా పాల్గొన్నారు. గుంటూరు ఇన్నర్ రింగ్ రోడ్డులో ప్రత్యేకంగా టిక్కెట్లు పెట్టి ఈవెంట్స్ నిర్వహించారు. ఆర్థికంగా స్థితిమంతులు టిక్కెట్ రూ.5 వేలు అయినా కొనుగోలు చేసి వేడుకలను వీక్షించడానికి వెళ్లారు. మహిళలు, యువతులు రాత్రి 12 గంటల వరకూ ముగ్గులు, నివాసాల ఆలంకరణలో నిమగ్నమయ్యారు. మద్యం దుకాణాలు, బార్లు, రెస్టారెంట్‌లకు మరో గంట సమయం పొడిగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో మద్యం విక్రయాలు జోరుగా సాగాయి. పలుచోట్ల అధికారులు మద్యంతో కూడిన పార్టీలకు అనుమతివ్వడం గమనార్హం. మద్యం సేవించినా డ్రైవింగ్ చేయరాదని, ప్రత్యేకంగా డ్రైవరును ఏర్పాటు చేసుకోవాలని పోలీసులు సూచించారు.

## రెవెన్యూ అర్జీల నూరుశాతం పరిష్కారానికి కృషి : కలెక్టర్ నాగలక్ష్మి

ప్రజాశక్తి-తెనాలిరూరల్

మండలంలోని బుర్రిపాలెంలో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించగా జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి హాజరై అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాల్లో నెలకొన్న రెవెన్యూ పరమైన సమస్యలను పరిష్కరించే క్రమంలో డిసెంబర్ 7న ప్రారంభించిన రెవెన్యూ సదస్సులు 2025 జనవరి 8 వరకు కొనసాగుతాయని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 222 రెవెన్యూ గ్రామాల్లో 116 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు పూర్తవగా ఇప్పటివరకు జిల్లా వ్యాప్తంగా 3454 అర్జీలు వచ్చాయని తెలిపారు. ప్రతి సదస్సుకు సుమారు 100 నుండి 150 అర్జీలు వస్తున్నాయని, వీటిని నూరుశాతం పరిష్కరించేలా కృషి చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో తెనాలి సబ్ కలెక్టర్ వి.సంజనా సింహ, ట్రైనీ కలెక్టర్ స్వప్నిల్ పవార్ జగన్నాథ్, తహశీల్దార్ కెవి గోపాలకృష్ణ, ఇతర అధికారులు పాల్గొన్నారు. తొలుత గ్రామంలో సామాజిక పింఛన్లను కలెక్టర్ పంపిణీ చేశారు.



# ఇళ్ల వద్దే పింఛన్లు ఇవ్వకుంటే మెమోలు

- నదుల అనుసంధానంతో నీటి కొరత లేకుండా చర్యలు
- 75 శాతం పాలనను గాడిలో పెట్టాం
- యలమంద పింఛన్ల పంపిణీ సభలో సిఎం చంద్రబాబు



యలమంద గ్రామంలో స్థానికులతో మాట్లాడుతున్న సిఎం చంద్రబాబు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పేదల జీవితాల్లో వెలుగులు నింపడమే నిజమైన సంక్షేమమని, పేదరికం లేని సమాజమే తన లక్ష్యమని సిఎం చంద్రబాబు అన్నారు. నరసరావుపేట మండలం యలమందలలో పింఛన్ల పంపిణీలో మంగళవారం పాల్గొన్న ఆయన మాట్లాడుతూ కష్టాల్లో ఉన్న వారికి స్నేహితుడిలా ఆదుకుంటానని, పేదరికం లేని సమాజం స్థాపించాలని, కష్టాల్లో ఉన్న పేదలను ఆదుకొని వృద్ధిలోకి తీసుకురావాలన్న ఎన్టీఆర్ ఆశయాలను అనుగుణంగా పనిచేస్తున్నామని చెప్పారు. దేశంలో 64 లక్షల మంది పెన్షన్లు ఇస్తున్న రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అన్నారు. పింఛనును లబ్ధిదారుని ఇంటి దగ్గర ఇవ్వాలని, అలా కాకుండా కార్యాలయంలో ఇస్తే ఫోన్లో జీపీఎస్ ద్వారా వెంటనే సమాచారం తమకు వచ్చేస్తుందని, సంబంధిత సిబ్బందికి వెంటనే మెమో పంపిస్తామని స్పష్టం చేశారు. 40 ఏళ్లకు పైగా తన రాజకీయ జీవితంలో ఎప్పుడూ చూడని విధ్వంసం గత ఐదేళ్లలో చూశానని, కేంద్రం నుంచి వచ్చిన నిధులన్నీ దారి మళ్లించారని గత ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. 'జె' ట్యాక్స్‌కు భయపడి పారిశ్రామికవేత్తలు రాష్ట్రం వైపే చూడలేదన్నారు. గాడి తప్పిన పాలనను 6 నెలల్లో 75 శాతం గాడిన పెట్టామని చెప్పారు. 198 అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేశామని, అవసరమైతే వెనుకబడిన ప్రాంతాల్లో ఇంకా ప్రారంభిస్తామని అన్నారు. చెత్తపై పన్ను, చేనేత కార్మికులకు జీఎస్టీ ఎత్తివేశామని, మత్స్యకారుల ఉపాధి దెబ్బతీసే 217 జీవో రద్దు చేశామని, స్వర్ణకారులకు కార్పొరేషన్ ఏర్పాటు చేశామని, మద్యం దుకాణాల్లో కల్లు గీత కార్మికులకు 10 శాతం వాటా కేటాయించామ. వివరించారు. రాష్ట్ర వ్యాప్తంగా రహదారుల మరమ్మతులు వేగంగా జరుగుతున్నాయన్నారు. దేశంలో ఆర్థిక సంస్కరణలకు నాంది పలికిన మన్మోహన్ సింగ్‌కు ఈ సందర్భంగా రాజకీయాలకు అతీతంగా సంతాపం తెలిపేందుకు నూతన సంవత్సర వేడుకలు చేయడం లేదన్నారు.

### గోదావరి జలాలతో జలహారతి

నదుల అనుసంధానంతో నీటి కొరత తీర్చి, కరువు లేకుండా చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నట్టు ముఖ్యమంత్రి చెప్పారు. వరదలతో గోదావరి నుంచి 3 వేల టీఎంసీల నీరు సముద్రంలోకి వృథాగా పోతోందని, ఈ ఏడాది కృష్ణా నదికి వచ్చిన వరదలతో 800 టీఎంసీలు సముద్రంలోకి పోయాయని తెలిపారు. గోదావరి నుంచి 300 టీఎంసీలను ఒడిసిపట్టి బనకచర్లకు తరలిస్తే మన రాష్ట్ర ముఖ చిత్రం మారిపోతుందన్నారు. టిడిపి కార్యకర్తల రుణం తీర్చుకోలేనిదని, వారిని అన్ని విధాలుగా అండగా ఉంటామని చెప్పారు. 5 కోట్ల మంది ఉన్న రాష్ట్రంలో టిడిపి సభ్యత్వాలు 90 లక్షలు దాటడం ఒక మైలు రాయన్నారు. పింఛన్ల పంపిణీ అనంతరం యలమందలోని కోదండ రామాలయాన్ని, కోటప్పకొండ ఆలయాన్ని సందర్శించారు.

ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ కోటప్పకొండ అభివృద్ధికి డాక్టర్ కోడెల శివప్రసాదరావు చెరగని ముద్ర వేశారని, మరింత అభివృద్ధికి ప్రభుత్వ సహకారం కావాలని కోరారు. కొండ కింది పైకి వెళ్లేందుకు రోప్ వే ఏర్పాటు చేయడం పల్నాడు జిల్లా లోనే కోటప్పకొండ అతి పెద్ద పర్యాటక ప్రదేశంగా అభివృద్ధి చెందుతుందని చెప్పారు. నియోజకవర్గ అభివృద్ధికీ నిధులు కేటాయించాలని కోరారు. టిడిపి డాక్టర్స్ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు, యలమంద గ్రామానికి చెందిన డాక్టర్ కడియాల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గ్రామంలో 1983లో ఎన్‌టిఆర్ పర్యటించారని గుర్తు చేశారు. గ్రామంలో కొంతమేర తాగునీరు సమస్య ఉందని, గ్రామస్తులతో తాను కూడా నిధులు వెచ్చించి నిర్మిస్తున్న కళ్యాణ మండపం నిర్మాణ పనులు నిధుల కొరత కారణంగా అసంపూర్తిగా ఉందని, వీటికి నిధులు కేటాయించాలని కోరారు. సిఎంకు మంత్రులు ఆనం రాం నారాయణరెడ్డి, గొట్టిపాటి రవికుమార్, చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు, ఎమ్మెల్యేలు యరపతినేని శ్రీనివాసరావు, చదలవాడ అరవిందబాబు, కన్నా లక్ష్మీనారాయణ, జూలకంటి బ్రహ్మారెడ్డి, ఐజి సర్వశ్రేష్ట త్రిపాఠి, జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు, జిల్లా ఎస్‌పి కె.శ్రీనివాసరావు, జెడ్‌పి చైర్‌పర్సన్ కె.హెనీక్రిస్టినా స్వాగతం పలికారు.

## భారీగా అక్రమ మద్యం స్వాధీనం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

చండీఘర్‌లో విక్రయించాల్సిన మద్యంను గుంటూరుకు తెచ్చి విక్రయిస్తున్న ముగ్గుర్ని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.2.46 లక్షల విలువైన 120 బాటిల్స్‌ను స్వాధీనం చేసుకున్నట్టు ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ కె.శ్రీనివాసులు తెలిపారు. గుంటూరులోని వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో మంగళవారం ఆయన మీడియాకు వివరాలు వెల్లడించారు. రొంపిచర్ల మండలం తుంగపాడుకు చెందిన బోడపాటి బాలకృష్ణ, ముండూరు మస్తాన్‌రావు, అనపర్తి యాకోబు అనే ముగ్గురు వ్యక్తులు చండీఘర్ నుంచి మద్యం తీసుకుని కంటైనర్‌తో గుంటూరు వైపు వస్తుండగా మానస సరోవరం పార్కు వద్ద తనిఖీల్లో ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. ఈ మద్యాన్ని వీరు రొంపిచర్ల మండలం తుంగపాడులో విక్రయిస్తుంటారు. బృందావన్ గార్డెన్స్‌కు చెందిన దుంపా దశరథరామిరెడ్డి అనే మరొకరు గతంలో మిలటరీలో పనిచేశాడు. ఇతను మిలటరీ మద్యం విక్రయిస్తుండగా స్థానిక బిఆర్ స్టేడియం వద్ద రూ.69,410 విలువైన 15 బాటిల్స్ స్వాధీనం చేసుకున్నారు.



కార్యక్రమంలో ఎక్సైజ్‌శాఖ జిల్లా అధికారి అరుణకుమారి, ఎఇఎస్ మారయ్య బాబు, వన్‌టౌన్ సిఐ బి.లత, ఎస్‌ఐ మొహ్మద్ ఖాసీం షరీఫ్ పాల్గొన్నారు.

## విద్యుత్ ప్రైవేటీకరణను విరమించుకోవాలి

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రాల్లో ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సమ్మె చేపట్టబోతున్నారని తెలిపారు. ఛండిఘర్‌లో కార్మికులు 1వ తేదీ నుండి చేపట్టే సమ్మెకు సిఐటియు సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు. రాష్ట్రంలో స్మార్ట్ మీటర్ల పేరుతో ప్రైవేటీకరణ విధానాలు అమలు జరుపుతున్నారని, ఇప్పటికే స్మార్ట్ మీటర్లు, సెకీలో అదానీ అవినీతి జరిగిందని హిడన్‌బర్గ్ నివేదిక బయట పెడితే, దానిపై అధికార ప్రతిపక్షాలు నోరు మెదపట్లేదని విమర్శించారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.నేతాజీ మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లు పెడితే వాటిని పగలగొట్టాలని గతంలో లోకేష్ పిలుపునిచ్చారని, మరిప్పుడు వాడవాడలా బిగిస్తుంటే వాటిపై ప్రశ్నించట్లేదని అన్నారు. స్మార్ట్ మీటర్లను తక్షణమే రద్దు చేయాలని, అదానీతో కుదుర్చుకున్న అన్ని రకాల ఒప్పందాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు నగర కార్యదర్శులు కె.శ్రీనివాసరావు, బి.ముత్యాలరావు, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్షులు రాంప్రభాకర్, చెన్నకేశవులు, ఎం.ఎ.చిష్టీ, షేక్.ఖాసింవలి, షేక్ మస్తాన్‌వలి, చింతల శ్రీనివాసరావు, కె.రాంబాబు పాల్గొన్నారు.

నరసరావుపేట నిరసనకు సిఐటియు పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.ఆంజనేయులు నాయక్ అధ్యక్షత వహించగా రాష్ట్ర నాయకులు గుంటూరు విజయ్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుపరం చేసేందుకు కేంద్రంలోని బిజెపి దూకుడు పెంచిందని, కార్పొరేట్ కంపెనీలకు, పెట్టుబడిదారులకు ఊడిగం చేసేలా విధానాలను తెస్తోందని, అందులో భాగంగానే చండీఘర్ రాష్ట్ర డిస్కంను ఎమినెంట్ ఎలక్ట్రిసిటీ లిమిటెడ్‌కు అమ్మడానికి రంగం సిద్ధం చేయడమని విమర్శించారు. లాభాల బాటలో ఉన్న చండీఘర్ డిస్కంలో 500 మంది పర్మినెంట్ ఉద్యోగులు, 500 మంది కాంట్రాక్టు కార్మికులు పనిచేస్తున్నారని, ఏడాదికి రూ.300 కోట్లకు పైగా ప్రభుత్వానికి లాభాలు అందించిందని తెలిపారు. సంస్థ విలువ నిర్ణయించడానికి కాగ్, కేంద్ర విద్యుత్ రెగ్యులేటరీ సంస్థ సహాయం తీసుకోవాలని పలు సంఘాల సలహాలు ఇచ్చినా పట్టించుకోలేదని విమర్శించారు. ఎమినెంట్ ఎలక్ట్రిసిటీ లిమిటెడ్ కంపెనీ ప్రైవేట్ యజమాని సంస్థకు కారు చౌకగా కట్టబెట్టడానికి బిజెపి మోడీ ప్రభుత్వం కుట్ర చేస్తోందన్నారు. దేశంలోని పవర్ గ్రేడ్ సబ్ స్టేషన్లను గుంప గుత్తగా ప్రైవేటుకు ఇవ్వాలని ఉత్తర్వులు జారీ చేసిందని మండిపడ్డారు. స్మార్ట్ మీటర్లు ఏర్పాటు రాయితీలు ఎత్తివేసి విద్యుత్ చార్జీలు పెంచడానికి రంగం సిద్ధం చేస్తున్నారన్నారు. చండీఘర్ తర్వాత యూపీలోని ఆగ్రా, వారణాసి తెలంగాణలోని హైదరాబాద్ దక్షిణ డిస్కం కూడా ప్రైవేటుకు అమ్మాలని నిర్ణయించిందన్నారు. ఈ విధానాలను మానుకోకుంటే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు పల్నాడు జిల్లా అధ్యక్షులు కె.హనుమంతరెడ్డి, నాయకులు డి.శివకుమారి, జి.మల్లీశ్వరి, షేక్ బందగీ సాహెబ్, మస్తాన్‌వలి, ఏపూరి గోపాలరావు, సిలార్ మసూద్, చిన్న అల్లాబక్షు, సుభాష్ చంద్రబోస్ పాల్గొన్నారు.

# వికసిత్ భారత్ జాతీయ స్థాయికి 10 అంశాలు ఎంపిక



ఎంపికైన యుకులో వీసీ కె.గంగాధరరావు, తదితరులు

ప్రజాశక్తి - ఏఎన్‌యు

2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా భారత్ చూపాలనే లక్ష్యంతో వికసిత్ భారత్ కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వం చేపట్టిందని, వికసిత్ భారత్‌కు యువత ఆలోచనలను, నూతన ఆవిష్కరణలను జోడించడానికి కేంద్ర యువజన సర్వీసుల మంత్రిత్వ శాఖ చర్యలు చేపట్టిందని ఉన్నత విద్యా మండలి అకడమిక్ ఆఫీసర్ శ్రీరంగం మ్యాథ్యూ అన్నారు. ఆన్లైన్ ద్వారా దేశవ్యాప్తంగా 10 అంశాలలో రాత పరీక్షను నిర్వహించగా వారిలో 4087 మంది ఎంపిక చేసి ఒక్కో అంశానికి 25 మంది చొప్పున 250 మందికి ఎంపిక చేసి వర్సిటీలో మంగళవారం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. 10 అంశాలలో మొదటి ముగ్గురిని జనవరి 11, 12 తేదీలలో న్యూఢిల్లీలో జరిగే కార్యక్రమానికి ఎంపిక చేశారు. ఎంపికైన అంశాల్లో... టెక్నాలజీ ఫర్ వికసిత్ భారత్, వికాసిత్ బి- విరసిత్ బి, ఎంపవరింగ్ యూత్ ఫర్ వికసిత్ భారత్, ఎన్ హాన్సింగ్ ప్రొడక్టివిటీ ఇన్ అగ్రికల్చర్, మేకిన్ ఇండియా ద స్టార్టప్ క్యాపిటల్ ఆఫ్ ది వరల్డ్, మేక్ ఇన్ ఇండియా ఫర్ స్పోర్టింగ్ అండ్ పిట్ నేషన్, మేకిన్ ఇండియా గ్లోబల్ మ్యానుఫ్యాక్చరింగ్ పవర్ హౌస్, స్ట్రైవింగ్ ఇండియా టు అవర్డ్స్ ఎ ఫుల్లి సస్టైనబుల్ ఫ్యూచర్, బిల్డింగ్ ఫర్ ద ఇన్ఫ్రాస్ట్రక్చర్ ఫర్ ద ఫ్యూచర్, ఎంపవరింగ్ ఉమెన్ అండ్ ఇంప్లిమెంటింగ్ సోషల్ ఇండికేషన్స్ ఉన్నాయి. వివిధ రాష్ట్రాలకు చెందిన వీరు వర్సిటీలోని సివిల్ అండ్ మెకానికల్ భవనంలో ఉన్న స్కిల్ డెవలప్మెంట్ సెంటర్లో వారి ఆలోచనలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జ్యూరీ సభ్యులకు వివరించారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జి వీసీ కె.గంగాధరరావు మాట్లాడుతూ యువత లక్ష్యాలను సాధించే క్రమంలో కృషి పట్టుదలతో పాటు వినూత్న ఆలోచనల వైపు పయనించాలన్నారు. ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ జి.సింహాచలం మాట్లాడుతూ విద్యార్థుల్లోని నైపుణ్యాలను క్రమ పద్ధతిలో అలవర్చుకుంటే విజేతలుగా ఎదుగుతారని చెప్పారు. కార్యక్రమానికి యూనివర్సిటీ ప్రతినిధిగా ఇన్‌ఛార్జి ఓఎస్టీ ఆర్‌విఎస్ఎస్ఎన్ రవికుమార్ పర్యవేక్షించారు.

## రోడ్డు ప్రమాదంలో బాలుడు మృతి



ప్రజాశక్తి - నకరికల్లు

ద్విచక్ర వాహనాన్ని వెనక నుండి లారీ ఢీకొట్టడంతో బాలుడు మృతి చెందాగా మరొక వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు వివరాల ప్రకారం.. మండలంలోని త్రిపురాపురానికి చెందిన దుర్గారావు ద్విచక్ర వాహనంపై గంజెనబోయిన కార్తీక్ (12)ను ఎక్కించుకొని నకరికల్లు వస్తుండగా అద్దంకి -నార్కెట్ పల్లి రాష్ట్ర రహదారి పక్కనగల చింతా పుల్లయ్య టేకు చెట్ల పొలం వద్ద వెనుక నుండి వస్తున్న లారీ ఢీకొట్టడంతో కార్తీక్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నరసరావుపేట ఏరియా వైద్యశాలకు తరలించారు. దుర్గారావుకు తీవ్రగాయాలు కావడంతో 108 ద్వారా ప్రవేటు వైద్యశాలకు తరలించారు. మృతిని తండ్రి వెంకటేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు. మృతుడు కార్తీక్ నకరికల్లు జెడ్‌పి పాఠశాలలో 6వ తరగతి చదువుతున్నాడు. ఎస్ఐ సిహెచ్ సురేష్ మాట్లాడుతూ చలికాలంలో మంచు ఎక్కువగా కురుస్తున్నందున రాత్రి సమయాల్లో, వేకూజామున ప్రయాణాలు చేయవద్దని, తప్పనిసరిగా ప్రయాణాలు చేయాలనుకుంటే జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ద్విచక్ర వాహనాలపై ప్రయాణించేవారు ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలన్నారు.



నిందితులు వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

## వివాహేతర సంబంధం, ఆర్థిక కారణాలతోనే మహిళ హత్య

ప్రజాశక్తి - పెదకాకాని

వివాహేతర సంబంధం నేపథ్యంలోనే మహిళను హత్య చేసినట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. ఈ మేరకు వివరాలను నార్త్ సబ్ డివిజన్ డీఎస్పీ సిహెచ్ మురళీకృష్ణ మంగళవారం వెల్లడించారు. ఈనెల 28న నంబూరుకు చెందిన మహమ్మద్ ఖాద్రాన్ని తన ఇంటిలో అద్దెకు ఉంటున్న షేక్ మల్లిక (31) అనుమానాస్పదంగా చనిపోయిందని పోలీసులకు సమాచారం ఇవ్వటంతో పెదకాకాని పోలీసులు పరిశీలించారు. మృతురాలికి 15 ఏళ్ల క్రితం మొదటి వివాహం కాగా ఇద్దరు సంతానం. పెళ్లయిన ఏడేళ్ల తర్వాత ఆమెకు మొదటి భర్తతో మనస్పర్థలు వచ్చి విడిపోయారు. పిల్లలిద్దరూ తండ్రివద్దే ఉంటున్నారు. ఈ క్రమంలో ఏడేళ్ల నుండి నంబూరుకు చెందిన కారుమూరి ప్రేమ్‌కుమార్‌ను మల్లిక ప్రేమించి రెండవ వివాహం చేసుకున్నారు. వీరు గుంటూరు బాలాజీ నగర్‌లో నివాసం ఉంటున్నారు. 2021లో ప్రత్తిపాడుకు చెందిన షేక్ అబ్దుల్ రెహమాన్‌తో మృతురాలికి సాన్నిహిత్యం ఏర్పడడంతో ఆమెకు రెహమాన్ రూ.15 లక్షల వరకూ నగదు, బంగారం ఇచ్చాడు. 9 నెలల క్రితం మృతురాలు, ఆమె భర్త నంబూరుకు కాపురాన్ని మార్చారు. ఆమెకోసం రెహమాన్ నంబూరుకు వెళ్లగా ఆమె తాను గ్రామానికి చెందిన నాగబాబు అనే వ్యక్తితో కలిసి ఉంటున్నాని, తనకోసం రావొద్దని చెప్పింది. తన సెల్ ఫోన్ నుండి నాగబాబుతో కలిసి ఉన్న వీడియోలను రెహమాన్‌కు పంపించింది. దీంతో భూత వైద్యుడు షేక్ జానాబ్ అహ్మద్‌ను రెహమాన్ కలిశాడు. మృతురాలి దుస్తులు, వెంట్రుకలను ఇచ్చి వశీకరణ చేయాలని కోరారు. అది ఫలించకపోవడంతో అహ్మద్‌కు రూ.మూడు లక్షల సుఫారీ ఇచ్చి హత్యకు పురమాయించాడు. అహ్మద్ ఎర్రబెల్లి కాజా రసూల్, మానిపాటి స్వప్నతో కలిసి ఈనెల 28వ తేదీన మధ్యాహ్నం మల్లిక ఇంటికెళ్లి ఆమె మెడను చున్నీతో బిగించి హత్య చేశారు. మృతురాలి సెల్‌ఫోన్‌ను పరిశీలించిన పోలీసులు విచారణ చేపట్టగా అలసు విషయం వెలుగులోకి వచ్చింది. నిందితులు ఇన్నర్ రింగ్ రోడ్డు వద్ద అరెస్టు చేశారు. కార్యక్రమంలో సిఐ టిపి నారాయణస్వామిని, ఎస్సైలు డి.వినోద్‌కుమార్, ఎస్‌కెయండి మీరజ్ కానిస్టేబుళ్లు ఆర్.రాజేంద్రప్రసాద్ ఎన్.శ్రీనివాసరావు, ఎం.సాగర్‌బాబు, వి.సుధాకర్, ఎమ్‌డి.ఇర్ఫాన్, పి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.



# విద్యుత్ రంగ పరిరక్షణ కోసం నిరసన

ప్రజాశక్తి - తెనాలి రూరల్

చండీఘర్ విద్యుత్ ఉద్యోగుల ఆందోళనకు మద్దతు తెనాలి చెంచుపేట విద్యుత్ కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో మంగళవారం నిరసన తెలిపారు. విద్యుత్ శాఖ ఈఈ చిరంజీవి మాట్లాడుతూ ఉద్యమానికి సంఘీభావం తెలిపారు. సిఐటియు జిల్లా నాయకులు కెబి ప్రసాద్ మాట్లాడుతూ గతంలో ప్రైవేటీకరణ కారణంగా సంభవించిన దుష్ఫలితాలను ప్రభుత్వాలు పట్టించుకోలేదన్నారు. గతంలో మహారాష్ట్రలో దబోల్‌లో అమరాన్ విద్యుత్ ప్రాజెక్టు పెట్టి మూసివేసారని గుర్తు చేశారు. 2000 సంవత్సరంలో మన రాష్ట్రంలో నాలుగు ప్రైవేటు కంపెనీలు 2400 మెగావాట్ల సామర్థ్యం గల గ్యాస్ ఆధారిత విద్యుత్ ప్లాంట్లు పెట్టి మూసేశారని చెప్పారు. వాటిద్వారా విద్యుత్ వాడకుండానే ప్రతిఏటా రూ.1200 కోట్లు ప్రజల నుండి డిస్కంలు వసూలు చేసి కార్పొరేట్లకు చెల్లించాలని చెప్పారు. అదాని కంపెనీల ద్వారా విద్యుత్ ను అధికధరకు కొనుగోలుచేసి ఆ భారాన్ని ప్రజలమీద వేస్తున్నారని అన్నారు. అవసరం లేకుండా విద్యుత్ మీటర్లను మారుస్తున్నారని, మీటర్ల కొనుగోలు కూడా అవినీతి మయమన్నారు. యుఈఈయు జిల్లా ప్రధాన కార్యదర్శి డి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఉద్యోగాలకు భద్రత లేకుండా పోతుందని, ఇకపై కాంట్రాక్ట్ అవుట్ సోర్స్ ఉద్యోగాలు మాత్రమే ఉంటాయని చెప్పారు. కార్యక్రమంలో జెఎఓ శ్రీనివాసరావు, ఆచారి, రోహిణి, ఎంఆర్టి రవి, శివనాగేశ్వరరావు, శ్రీలక్ష్మి, ధనలక్ష్మి, సరళ, మల్లేశ్వరి, సిఐటియు నాయకులు షేక్ హుస్సేన్‌వలి, కె.రవికుమార్, ఎం.సాంబశివరావు, కె.దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.





## మండల స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలు

**ప్రజాశక్తి - పెదనందిపాడు:** స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్లో మండల స్థాయిలో సైన్స్ ఫెయిర్, బుక్ ఫెయిర్, క్విజ్ పోటీల కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. మండల పరిధిలోని అన్ని హైస్కూళ్లకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. గెలుపొందిన విద్యార్థులు శుక్రవారం జిల్లా స్థాయిలో జరిగే సైన్స్ ఫెయిర్ పోటీలకు అర్హత పొందుతారని ఎంఈఓలు ముద్దన శ్రీనివాసరావు, పి.జాకబ్ తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎన్.లక్ష్మీదుర్గ, సైన్స్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**ప్రజాశక్తి - చేబ్రోలు :** నారాకోడూరులోని జెడ్‌పి పాఠశాలలో మండల స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌ను మంగళవారం మండల విద్యాశాఖ అధికారి సుబ్బారావు ప్రారంభించారు. సైన్స్ ఎగ్జిబిషన్లో చేబ్రోలు మండలంలోని నాలుగు ఉన్నత పాఠశాలలో విద్యార్థులు పాల్గొన్నారు. మండల విద్యాశాఖ అధికారి సుబ్బారావు మాట్లాడుతూ విద్యార్థులందరూ శాస్త్రీయ దక్పథాన్ని పెంపొందించుకోవాలని ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరు సైన్స్ పట్ల అవగాహన పెంచుకోవాలన్నారు. నారా కోడూరు విద్యార్థులు జిల్లా స్థాయికి ఎంపికైనందుకు అభినందనలు తెలిపారు. వ్యక్తిగత విభాగంలో ఎస్.కె నజ్మా జెడ్పి హై స్కూల్ నారా కోడూరు ప్రథమ స్థానం సాధించగా, గ్రూపు ఎగ్జిబిట్ లో కె సీ హై స్కూల్ విద్యార్థులు ప్రథమ స్థానం సాధించారని చెప్పారు. టీచ్ టీచర్ సెగ్మెంట్లో ఎగ్జిబిట్లు దుర్గ బాయి ప్రథమ స్థానం సాధించగా, క్విజ్ పోటీలో జెడ్ పి హెచ్ ఎస్ నారాకోడూరు విద్యార్థులు ప్రథమ స్థానం సాధించారు. మండల స్థాయిలో ప్రథమ స్థానం సాధించిన విద్యార్థులు గుంటూరులో జరిగే జిల్లా స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌లో పాల్గొనాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఏడుకొండలు, సైన్స్ ఉపాధ్యాయులు కుమారి, ఎన్.అరుణకుమారి, కృష్ణారావు, టి.వెంకటేశ్వర్లు, కె.ప్రసాదు పాల్గొన్నారు.



## స్కేటింగ్‌లో సెయింట్ జోసెఫ్ విద్యార్థి ప్రతిభ

**ప్రజాశక్తి - పెదకాకాని :** మండల కేంద్రమైన పెదకాకానిలోని సెయింట్ జోసెఫ్స్ (సీబీఎస్ఇ) హైస్కూల్ కు చెందిన ఏడవ తరగతి విద్యార్థి షేక్ అబ్జల్ ఈనెల 22వ తేదీన గుంటూరులో జరిగిన రాష్ట్రస్థాయి స్కేటింగ్ పోటీలలో ప్రథమ బహుమతి గెలుపొందినట్లు హెచ్ఎం సిస్టర్ సంధ్యారాణి తెలిపారు. 10,11 తేదీలలో మహారాష్ట్రలో జరిగే జాతీయస్థాయి పోటీలకు అబ్జల్ అర్హత పొందడం ఆనందంగా ఉందన్నారు.

**తెనాలి అడిషనల్ సీనియర్ సివిల్‌జడ్జి కోర్టులో**
**ఓ.యస్. 50/2023 ఇ.పి. 23/2024**

బిట్వీన్ :
సబ్బెళ్ళ రవిశేఖర్ రెడ్డి .... డిక్రీ హోల్డర్
మరియు
కాసుల సత్యనారాయణ,
తండ్రి : హనుమయ్య,
డోర్ నెం. 7-15-21,
బాబూ ఎన్‌క్లేవ్ రెసిడెన్షియల్,
గంగానమ్మపేట,
తెనాలి .... జడ్జిమెంట్ డెటార్

పై నెంబరు ఇ.పి.లో కోర్టువారు పంపిన నోటీసులను మీరు తీసుకొనక తిప్పి పంపుచున్నందున, కోర్టువారు మీకు/ జెడిఆర్‌కు పేపరు పబ్లికేషన్ ద్వారా నోటీసు ఆర్డరు వేసినారు. కావున మీరు / జెడిఆర్ ది. 10-01-2025 ఉదయం 10-30 గం.లకు పై కోర్టునందు స్వయంగా గానీ, ప్లీడరుగారి ద్వారా గానీ హాజరై సంజాయిషీ తెలుపవలెను. లేనియెడల ఇ.పి.ని మీకు పరోక్షముగా తీర్మానించబడును.

వాయిదా : 10-01-2025

**ఎస్.బి.శివ,**
**డి.హెచ్‌ఆర్ తరపు అడ్వకేట్.**

**మహారాజశ్రీ విజయవాడ 14వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో (కృష్ణాజిల్లా)**
**G.W.O.P.No. 63/2024.**

బిట్వీన్ :
తాడిశెట్టి అన్నపూర్ణ ....పిటిషనరు
మరియు
నిల్ .... రెస్పాండెంట్

యిందుమూలముగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా, యిందలి పిటిషనరు అయిన తాడిశెట్టి అన్నపూర్ణ తన మైనరు కుమార్తె అయిన తాడిశెట్టి హసిత నాగ సిరి తరపున ఈ దిగువ షెడ్యూలు దాఖలా స్థిరాస్తిలో ఆమెకు గల 1/3వ వంతు అవిభక్త వాటాను విక్రయించుటకు అనుమతి కోరుతూ పైన తెల్పిన G.W.O.P. 63/2024ను దాఖలు చేసియున్నారు. షెడ్యూలు దాఖలా స్థిరాస్తిలో పైన తెల్పిన మైనరు యొక్క 1/3వ వంతు అవిభక్త వాటాను విక్రయించి సదరు సొమ్ముతో మైనరు యొక్క ఉన్నత విద్య మరియు అభివృద్ధి కొరకు ఉపయోగించుటకు పైన తెల్పిన G.W.O.P ని దాఖలు చేసియున్నారు. కావున సదరు విషయముపై ఎవరికైననూ ఏవిధమైన ఆక్షేపణలు, అభ్యంతరములు ఉన్నయెడల పైన తెల్పిన శ్రీకోర్టు వారి యెదుట ది. 24-01-2025న ఉదయం గం.10.30 లకు హాజరై తెలుపకొనవలెను, లేనియెడల పరోక్షముగా తీర్మానించబడును.

**షెడ్యూలు**

గుంటూరు జిల్లా, గుంటూరు సబ్ డివిజన్, గుంటూరు మున్సిపల్ కార్పోరేషన్ ఏరియా, గుంటూరు మున్సిపల్ వార్డు నెం.4/919, 20/497, పాత మున్సిపల్ వార్డు నెం.15, కొత్త మున్సిపల్ వార్డు నెం. 27, టి.యస్. నెం. 22, 24, 25, 32,33, మున్సిపల్ అసెస్మెంట్ నెం. 31159, చ.గ. 185ర్లు, డోర్ నెం.23-5-10 కు హద్దులు...

తూర్పు : పసుపులేటి అబద్దయ్య గారిఆస్థి చ.అ...13.5
దక్షిణం : యర్రంశెట్టి పరసురామయ్య గారి ఆస్తి చ.అ.21.0
తి.తూర్పు: యర్రంశెట్టి పరసురామయ్య గారి ఆస్తి చ.అ.06.4
తి. దక్షిణం: దాసరి రంగయ్య గారి ఆస్తి చ.అ.47.9
పడమర: మున్సిపల్ కార్పోరేషన్ రోడ్డు చ.అ.24.3
ఉత్తరం : ముత్తా రామయ్య గారి ఆస్తి 31 అడుగులు మరియు వారి గోడ హద్దు చ.అ. 37.0

యీ హద్దుల మధ్య గల చ.గ.185ర్లు లేదా 154.67 చ.మీ. గల నివేశన స్థలము మరియు అందులోని 2 అంతస్తులు గల డాబాలో మైనరుకు గల 1/3వ వంతు (61.66 చ.గ) అవిభక్త వాటా

// శ్రీ కోర్టువారి ఉత్తర్వుల అనుసరించి//

వాయిదా తేది : 24-01-2025

**ఇట్లు**
**బి.సూర్యప్రకాశ రావు, అడ్వకేట్,**
**గవర్నర్ పేట, విజయవాడ-520002**
**సెల్ నెం. 9849695243**

## కొనసాగుతున్న మహిళా రైతు ధర్నా

ప్రజాశక్తి - దాచేపల్లి

తన భూమిలో రోడ్డు వేసి లారీలతో రాకపోకలు సాగిస్తున్న శ్రీ సిమెంట్ ఫ్యాక్టరీ నుండి పరిహారం కోసం మండలంలోని పెద్దగార్లపాడుకు చెందిన మహిళా రైతు చేస్తున్న ధర్నా మంగళవారం రెండో రోజుకు చేరుకుంది. శ్రీ సిమెంటు యాజమాన్యం తనకు నష్టపరిహారం చెల్లించేంత వరకు ధర్నా ఆపేది లేదని కామిశెట్టి లక్ష్మమ్మ తేల్చి చెప్పారు. పొలంలో వేసిన రోడ్డు మీద నుండి లారీలు ఫ్యాక్టరీలోకి వెళ్లకుండా ముళకంచ, మట్టి వేశారు.

## న్యాయవాదులు విధుల బహిష్కరణ

ప్రజాశక్తి- మాచర్ల రూరల్

గుంటూరు జిల్లా పొన్నూరు బార్ అసోసియేషన్ సభ్యులు బేతాళ ప్రకాషరావుపై పొన్నూరు అర్బన్ సిఐ రవికిరణ్, ఎస్ఐ రాజ్‌కుమార్, కానిస్టేబుళ్ళు గోవి, మాధవ్‌గోపి, కంప్యూటర్ ఆపరేటర్ అమానుషంగా దాడి చేశారని మాచర్ల బార్ అసోసియేషన్ ఖండించింది. ఈ మేరకు మంగళవారం న్యాయవాదులు విధులను బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు. సీనియర్ న్యాయవాదులు సిహెచ్. నాగిరెడ్డి, గట్ల సత్యనారాయణరెడ్డిలు మాట్లాడుతూ పోలీసులు గత కొన్ని రోజులుగా న్యాయవాదులపై దాడులు చేయటం అలవాటుగా మారిందని, పోలీసులు తమ పద్ధతులను మార్చుకోని పక్షంలో వారిపై ప్రైవేటు కేసులు వేసి న్యాయపరంగా పోరాడతామని హెచ్చరించారు. ఇప్పటికైన పోలీసులు న్యాయవాదుల పట్ల చేస్తున్న ఆమానుష చర్యలను మానుకోవాలని డిమాండ్ చేశారు. నిరసనలో మాచర్ల బార్ అసోసియేషన్ అధ్యక్షులు జూపల్లి శ్రీనివాసరావు, సెక్రటరీ శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యక్షులు పులిమెల రామారావు, వై.కృష్ణమూర్తి, బి.నరసింహారావు, కేశం శ్రీనివాసరావు, అందుగుల బాలజోజి, కొత్తపల్లి డేవిడ్‌రాజు, వడ్డెంగుంట ఏడుకొండలు, ఆర్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## మాచర్ల ఆర్ఐగా అనిల్ కుమార్

ప్రజాశక్తి- మాచర్ల

మాచర్ల రెవెన్యూ ఇన్స్‌పెక్టర్‌గా అనిల్ కుమార్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. గుంటూరు డిఎస్ఒ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ ప్రమోషన్‌పై మాచర్లకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని చెప్పారు.



కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంఈవో సురేష్, మురళి, పాఠశాల ఉపాధ్యాయులు

## కృష్ణవేణి స్కూల్ కేలండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి- మాచర్ల

పట్టణంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్ నందు మంగళవారం ముందస్తు నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. ముఖ్యఅతిథులుగా మండల విద్యాశాఖాధికారి-2 అల్లి సురేష్, ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు యూనియన్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు విద్యాధరణి మురళి పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి వారు మాట్లాడుతూ రాబోవు నూతన సంవత్సరంలో విద్యార్థులందరికీ శుభ ఫలితాలు అందాలని ఆకాంక్షించారు. పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. ఈ సందర్భంగా కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌కు చెందిన నూతన సంవత్సర క్యాలెండర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం రామకృష్ణ, శ్రీధర్‌గప్త, డాక్టర్ శివ, హరిశ్చంద్ర, ప్రిన్సిపాల్ హనుమంతరావు, గౌరి, నాగజ్యోతి, శ్రీలక్ష్మీరెడ్డి, ఎవిటి అంజయ్య నాయక్, విద్యార్థులు పాల్గొన్నారు.





# ఫ్లోర్‌బాల్ ఛాంపియన్లుగా బీహార్, తమిళనాడు జట్లు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

**అండర్-12 బాలికల విభాగంలో విజేతగా, బాలుర విభాగంలో 3వ స్థానంలో ఆంధ్రప్రదేశ్**

18వ నేషనల్ ఫ్లోర్‌బాల్ ఛాంపియన్‌షిప్ టోర్నమెంట్‌లో బీహార్, తమిళనాడు జట్లు విజేతలుగా నిలిచాయి. నరసరావుపేటలోని కె-రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో నాలుగు రోజుల నుంచి జరుగుతున్న పోటీలు మంగళవారం ముగిశాయి. ఈ సందర్భంగా బహుమతులు ప్రధానోత్సవానికి ముఖ్య అతిథులుగా కె-రిడ్జ్ స్కూల్ చైర్మన్ నాతాని వెంకటేశ్వర్లు, డైరెక్టర్ కోమటినేని నాసరయ్య, ఈశ్వర్ ఇంజినీరింగ్ కాలేజీ చైర్మన్ మీరావలి హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. అండర్ -17 బాలుర విభాగంలో బీహార్ జట్టు మొదటి విజయం సాధించగా రెండు, మూడు స్థానాల్లో ఛత్తీస్‌ఘడ్, తమిళనాడు నిలిచాయి. అండర్-17 బాలికల విభాగంలో తమిళనాడు విసయం సాధించగా రెండు, మూడు స్థానాలను కర్ణాటక, హర్యానా దక్కించుకున్నాయి. అండర్ -12 బాలుర విభాగంలో తమిళనాడు గెలుపొందగా తర్వాతి స్థానాల్లో జమ్మూ-కాశ్మీర్, ఆంధ్రప్రదేశ్ జట్లు నిలిచాయి. అండర్-12 బాలికల విభాగంలో ఆంధ్రప్రదేశ్ విజేతగా నిలవగా తర్వాతి రెండు స్థానాలను కర్ణాటక, తమిళనాడు దక్కించుకున్నాయి. కార్యక్రమంలో ఇండియన్ ఫ్లోర్ బాల్ ఫెడరేషన్ వైస్ చైర్మన్ దీపేంద్ర, ఫ్లోర్ బాల్ అబ్జర్వర్ పంకజ్, ఏపీ ఫ్లోర్ బాల్ సెక్రటరీ కెజె.జోసెఫ్, ప్రిన్సిపల్ బర్నబాస్, క్యాంపస్ ఇన్‌ఛార్జి కోట బాపూజీ, అకాడమిక్ కో-ఆర్డినేటర్ హేమంత్ పాల్గొన్నారు.
















## సిఎం చంద్రబాబు పర్యటన దృశ్యాలు













(ప్రజాశక్తి - పల్నాడు జిల్లా)

# అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి : సిపిఎం



కొల్లిపరలో నిరసనలో మాట్లాడుతున్న ఎన్ భావన్నారాయణ

**ప్రజాశక్తి - కొల్లిపర**

కేంద్ర హోంమంత్రి అమిత్ షా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పట్ల పార్లమె ంట్‌లో అనుచిత వ్యాఖ్యలు చేయడానికి సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎన్ భావన్నారాయణ ఖండించారు సోమవారం మండల కేంద్రమైన కొల్లిపరలో ర్యాలీ నిర్వహించి, అనం తరం అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా భావన్నా రాయణ మాట్లాడుతూ పార్లమెంట్‌లో అంబేద్కర్ అంబేద్కర్ అంటూ నామస్మరణ జపం చేయడం కంటే భగవంతుని నామ స్మరణ చేస్తే స్వర్గలోక ప్రవేశం దొరుకుతుందని అంబేద్కర్‌ను రాజ్యాంగాన్ని అవమానపరిచిన అమిత్ షాను కేంద్ర మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రిజర్వేషన్ ఎత్తివేసేందుకు బిజెపి ప్రభుత్వం కుట్ర పన్నుతుందన్నారు. ప్రజల మధ్య మతం పేరుతో చీలికలు తెచ్చి విభజించాలని బిజెపి చూస్తుందని, ప్రజలందరూ ఐక్యంగా తిప్పి కొట్టాలన్నారు. కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు మొలకా శివ సాంబిరెడ్డి సిపిఎం మండల కార్యదర్శి కోటా చంద్రశేఖర్ వైయస్‌ఆర్‌సిపి నాయకులు పిల్లి గంగాధర్ కార్మిక నాయకులు గోదాసుందర్రావు మల్లోల రమేష్ రామయ్య కోటేశ్వరరావు మల్లోల కుమారి గోదా దీనమ్మ పాల్గొన్నారు.

**ప్రజాశక్తి -తాడికొండ :** డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్ షా క్షమాపణలు చెప్పాలని వామపక్ష పార్టీలు డిమాండ్ చేసాయి. తాడికొండలోని అంబేద్కర్ విగ్రహం వద్ద అమిషా వ్యాఖ్యలకు సిపిఎం సిపిఐ పార్టీలు సోమవారం నిరసన చేపట్టారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు చింతల భాస్కరరావు, కనగాల పూర్ణచంద్రరావు, సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి ముప్పాళ్ళ శివ శంకర్ రావు, కుర్ర అనిల్ కుమార్, రేపూడి శ్రీనివాసరావు, జోజి, సత్యనారాయణ పాల్గొన్నారు.

**ప్రజాశక్తి - పెదనందిపాడు :** భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ మీద రాజ్యసభలో కేంద్ర మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలకు నిరసనగా, వామపక్ష పార్టీల దేశవ్యాప్త పిలుపు మేరకు మంగళవారం పెదనందిపాడు సిపిఎం మండల శాఖ ఆధ్వర్యంలో, పెదనందిపాడు లోని పాత బస్టాండ్ సెంటర్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించి, నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మండల కార్యదర్శి దొప్పలపూడి రమేష్ బాబు, సహాయ కార్యదర్శి కొత్త వెంకటశివరావు మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌ను అవమానకరంగా మాట్లాడిన అమిత్ షాను మంత్రివర్గం నుండి వెంటనే పదవి నుండి తొలగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు, జంపని రామారావు, కాపు వెంకట సుబ్బారావు, దేవరకొండ శ్రీనివాసరావు, పి భువనేశ్వరి, పటాన్ సలీం, మర్రి లక్ష్మి, గద్దె అభిరామ్, పోపూరి సుధీర్, కొలగాని వీరయ్య, పాల్గొన్నారు.


పెదనందిపాడులో


తాడికొండలో

# నేషనల్ ఇంటిగ్రేషన్ క్యాంపునకు నిర్మల ఫార్మసీ విద్యార్థిని ఎంపిక


సంజన ను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

**ప్రజాశక్తి - మంగళగిరి రూరల్**

నిర్మల కాలేజ్ ఆఫ్ ఫార్మసీలో 3వ సంవత్సరం బి. ఫార్మసీ చదువుతున్న మరియు జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్)లో క్రియాశీల వాలంటీర్‌గా వ్యవహరిస్తున్న బి. సంజన, ప్రతిష్టాత్మక జాతీయ సమగ్రత శిబిరం (నేషనల్ ఇంటిగ్రేషన్ క్యాంప్)లో పాల్గొనడానికి ఎంపికయ్యారు. కర్ణాటకలోని గుల్బర్గా విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో జనవరి 14 నుండి 21 వరకు జరిగే శిబిరంలో పాల్గొననున్నారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం నుంచి 10 మంది మాత్రమే ఈ శిబిరానికి ఎంపిక కాగా, సంజన ఈ ప్రతిష్టాత్మక అవకాశాన్ని పొందినందుకు పలువురు అభినందించారు. తమ కళాశాల విద్యార్థిని ఎంపిక పట్ల కళాశాల కరస్పాండెంట్ ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం జాతీయ సేవా పథకం విభాగానికి మరియు ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ దివ్య తేజోమూర్తి కి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా మంగళవారం నిర్మల కాలేజ్ ఆఫ్ ఫార్మసీలో అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ సిస్టర్ జి. నిర్మల జ్యోతి, ప్రిన్సిపల్ డాక్టర్ బి. పాముల రెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ రేఖా నరేష్ బాబు, డాక్టర్ నరసింహ నాయక్ మరియు ఇతర అధ్యాపకులు సంజనను అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ప్రతినిధులు, సంజన ఎన్ ఎస్ ఎస్ లో చేసిన సేవలను ప్రశంసిస్తూ, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, కాలేజీ మరియు విశ్వవిద్యాలయ గౌరవాన్ని పెంచాలని ప్రోత్సహించారు.




తాడేపల్లిలో

# మతోన్మాద శక్తుల నుండి దేశాన్ని కాపాడుకోవాలి

## సిపిఎం ఆధ్వర్యంలో విస్తృతంగా కరపత్రాలతో ప్రచారం

**ప్రజాశక్తి -తాడేపల్లి రూరల్ :** భారత రాజ్యాంగాన్ని కాపాడాలని, మత సామరస్యాన్ని కాపాడాలని కోరుతూ సోమవారం తాడేపల్లి పట్టణ ప్రాంతంలోని ముగ్గురోడ్డులో సిపిఎం నాయకులు కరపత్రాలు పంపిణీ చేస్తూ విస్తృత ప్రచారాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు దొంతి రెడ్డి శ్రీనివాస కుమారి మాట్లాడుతూ భారత రాజ్యాంగానికి తూట్లు పొడిచే విధంగా వ్యవహరిస్తున్న నరేంద్ర మోడీ బిజెపి ప్రభుత్వాన్ని , ప్రజా వ్యతిరేక విధానా లను ప్రజలందరూ వ్యతిరేకించాల న్నారు. కార్యక్రమంలో సిపిఎం తాడేపల్లి పట్టణ నాయకులు కోట బాబురావు, దర్శనపు విజయ్, లీలమ్మ, కే మేరీ తదితరులు పాల్గొన్నారు. తాడేపల్లి పట్టణ పరిధిలోని కేఎల్ రావు కాలనీలో సిపిఎం శ్రేణులు ప్రచారాన్ని చేపట్టారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు వేంపాటి సామ్యేలు, కే మేరీ, పాప పాల్గొన్నారు.

**ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్ :** మతోన్మాద శక్తుల నుండి భారత రాజ్యాంగాన్ని, మత సామరస్యాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని, సిపిఎం తాడేపల్లి పట్టణ కార్యదర్శి బూరుగ వెంకటేశ్వరరావు అన్నారు. తాడేపల్లి పట్టణ పరిధిలోని పుష్కర కాలనీలో మంగళవారం సిపిఎం శ్రేణులు భారత రాజ్యాంగాన్ని, మత సామరస్యాన్ని కాపాడాలని కోరుతూ ఇంటింటికీ కరపత్రాల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ బిజెపి పరిపాలనలో నిత్యవసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగాయని, పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు విపరీతంగా పెంచేసి ప్రజలపై భారాల వేశారని ఆయన మండిపడ్డారు. ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ అన్ని వర్గాల ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్న బిజెపి పాలనను ప్రజలు వ్యతిరేకించాలని ఆయన అన్నారు. సుందరయ్య నగర్ లో మతోన్మాద బిజెపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా భారత రాజ్యాంగాన్ని కాపాడాలని, మత సామరస్యాన్ని కాపాడాలని కోరుతూ మంగళవారం సిపిఎం తాడేపల్లి పట్టణ నాయకులు కొట్టే కరుణాకర రావు, ఎస్ కే భాష సుందరయ్య నగర్ లో కరపత్రాలు పంపిణీ చేస్తూ విస్తత ప్రచారాన్ని నిర్వహించారు.

**ప్రజాశక్తి - తుళ్లూరు :**బిజెపి నేతత్వంలోని కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగం నిర్దేశించిన మార్గాన పురోగమన వైపు దేశాన్ని నడిపించే బదులు తిరోగమన దశలో నడిపించే ప్రయత్నాలు చేస్తుందని సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు,రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం రవి అన్నారు. దేశ సమైక్యత, మతసామరస్యం వెల్లి విరియాలని, స్వేచ్ఛ,సమానత్వం, ప్రజాస్వామ్యం, ప్రగతి బాటలో రానున్న 2025నూతన సంవత్సరంలో ముందడుగు వేద్దామంటూ నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ, సిపిఎం ప్రచార కార్యక్రమాన్ని రాజధాని మండల కేంద్రమైన తుళ్లూరులో ఎం రవి సోమవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా తుళ్లూరులో లైబ్రరీ సెంటర్లో,వివిధ ప్రభుత్వ కార్యాలయాలు, పోలీస్ స్టేషన్ లో సిపిఎం శ్రేణులు కరపత్రాల పంపిణీ చేపట్టారు.ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ, సంవత్సరం నుండి మణిపూర్ రాష్ట్రం అగ్నికి ఆహుతి అవుతున్నా ఆ రాష్ట్రం వైపు చూసే తీరుబాటు లేకుండా విదేశ యానాలలో మునిగితేలుతున్నారని, మణిపూర్ ఘటనలను ఖండించడానికి కూడా ప్రధాని మోడీ కి నోరు రావడంలేదని అన్నారు. ప్రజల ప్రధాన సమస్యలను పరిష్కరించుకోవడానికి, రాష్ట్రానికి ఉన్న హక్కులను సాధించుకోవడానికి, అందరం సమైక్యంగా పాటుపడాలని, సమైక్యతకు విఘాతం కలిగించే విద్వేష పూరిత ప్రసంగాలను దరిచేరనివ్వొద్దని, 'గడప లోపలే మతం గడప దాటితే భారతీయులం..' అన్న సహోదర భావంతో ముందడుగు వేద్దామని అన్నారు. కార్యక్రమంలో సిపిఎం రాజధాని డివిజన్ నాయకులు పేరం బాబురావు, ఎం భాగ్యరాజు,జొన్నకూటి నవీన్ ప్రకాష్, వల్లభాపురం వెంకటేశ్వరరావు, గడ్డం కృష్ణ తదితరులు పాల్గొన్నారు.


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న మంత్రి నాదెండ్ల మనోహర్ తదితరులు

# కేలండర్‌ను ఆవిష్కరించిన మంత్రి మనోహర్

**ప్రజాశక్తి-తెనాలిరూరల్**

ఆంధ్ర ప్రదేశ్ ఎస్సి, ఎస్టి వెల్ఫేర్ అసోసియేషన్ 2025 నూతన క్యాలెండర్‌ను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ మంగళవారం తెనాలి క్యాంప్ కార్యాలయంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర జనరల్ సెక్రెటరి మేడికొండ సునీల్, రాష్ట్ర కోశాధికారి దాసరి విజయ్ కుమార్, రాష్ట్ర డిప్యూటి జనరల్ సెక్రెటరి చందన, రీజనల్ సెక్రటరి శ్రీనివాస్ నాయక్ పాల్గొన్నారు.


మంగళగిరిలో సిఐటియు క్యాలెండర్ ఆవిష్కరించిన నాయకులు

# సిఐటియు కేలండర్ ఆవిష్కరణ

**ప్రజాశక్తి - మంగళగిరి**

సిఐటియు పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ముద్రించిన నూతన సంవత్సరం 2025 క్యాలెండర్‌ను మంగళవారం పూల మార్కెట్ సెంటర్‌లో సిఐటియు పట్టణ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి సిఐటియు పట్టణ కార్యదర్శి ఎం బాలాజీ అధ్యక్షత వహించారు. సిఐటియు సీనియర్ నాయకులు జెవి రాఘవులు, ప్రజా ఆరోగ్య వేదిక రాష్ట్ర గౌరవ అధ్యక్షులు డాక్టర్ కెవిఎస్ సాయి ప్రసాద్, సిపిఎం పట్టణ కార్యదర్శి వివి జవహర్లాల్, ప్రముఖ వైద్య నిపుణురాలు పి గిరిజ మాట్లాడుతూ సిఐటియు నిరంతరం పేదల పక్షాన పోరాడుతుందని అన్నారు. అలాంటి సంఘం తరపున క్యాలెండర్ ముద్రించడం సంతోషదాయకమని అన్నారు. ఈ సందర్భంగా కార్మిక వర్గానికి, పట్టణ ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి బాలకృష్ణ, సిఐటియు పట్టణ అధ్యక్షులు వై కమలాకర్, సిఐటియు నాయకులు షేక్ జానీ భాష, టి శ్రీనివాసరావు, పి రామచంద్రరావు, టి శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు. ప్రజానాట్యమండలి కళాకారులు విప్లవ గేయాలు ఆలపించారు.




# యుటిఎఫ్ కేలండర్, డైరీ ఆవిష్కరణ

**ప్రజాశక్తి - చేబ్రోలు**

యుటిఎఫ్ క్యాలెండరు, డైరీలను చేబ్రోలు మండల విద్యాశాఖ అధికారి రాయల సుబ్బారావు, మరియు చేబ్రోలు మండల యు టి ఎఫ్ నాయకులు మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారి మాట్లాడుతూ యుటిఎఫ్ శాఖ తరుపున ఉపాధ్యాయులందరికీ అవసరమైన సమాచారం అంతా క్రోడీకరించి డైరీని తీసుకురావడం అభినందనీయమని అన్నారు. ఉపాధ్యాయులకు హక్కుల కోసం పోరాటంలో యుటిఎఫ్ పాత్రను అభినందించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ మండల కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి విజయరాజు, పార్థసారథి గౌరవ అధ్యక్షులు శ్రీనివాసరెడ్డి కోశాధికారి కే శ్రీనివాసరావు సహ అధ్యక్షులు ఎం. శ్రీనివాసరావు, మండల కార్యదర్శులు కే శ్రీనివాసరావు, విజయలక్ష్మి, మహమ్మద్ ఈసా, ఆడిట్ కమిటీ కన్వీనర్ ఎం శ్రీరామమూర్తి, జిల్లా కౌన్సిలర్లు డి నాగేశ్వరరావు, వై రమేష్ బాబు, షేక్ సైదా మరియు జిల్లా కార్యదర్శి జి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



## కేన్సర్ ఆస్పత్రి నిర్మాణానికి రూ.కోటి విరాళం

ప్రజాశక్తి - అమరావతి

అమరావతిలో నిర్మించనున్న బసవతారకం ఇండో అమెరికన్ కేన్సర్ ఆసుపత్రి నిర్మాణానికి ఎన్ఆర్ఐ, డాక్టర్ సూరపనేని వంశీకృష్ణ, డాక్టర్ ప్రతిభ దంపతులు భారీ విరాళం ఇచ్చారు. అమరావతి మండలం అత్తలూరుకు చెందిన వీరు సిఎం చంద్రబాబుకు రూ.కోటి చెక్కును సచివాలయంలో అందించారు. వీరిని చంద్రబాబు అభినందించి... అమరావతి నిర్మాణంలోనూ ఎన్ఆర్ఐలు పాలుపంచుకోవాలని పిలుపునిచ్చారు. సిఎంను కలిసిన వారిలో డాక్టర్ ప్రతిభ తండ్రి ఎస్.సురేంద్రబాబు, ఇతర కుటుంబ సభ్యులు, ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్, ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఉన్నారు.



## అగ్ని ప్రమాద బాధితులకు సాయం

ప్రజాశక్తి - విజయపురిసౌత్

మాచర్ల మండలం బోధనంపాడు చెంచుకాలనీలో అగ్ని ప్రమాదానికి గురై ఉడుతల ఈదయ్య పూరి గుడిసె దగ్ధమవగా ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి ఆదేశాలతో టిడిపి నాయకులు ఘటనా స్థలిని మంగళవారం పరిశీలించారు. బాధితుణ్ని పరామర్శించి నిత్యావసర సరుకులతో పాటు రూ.12 వేల సాయం అందించారు. వి.శ్రీరామమూర్తి, టి.కృష్ణ, ఆర్.సైదారావు, ఎం.కృష్ణ, వి.రామారావు, సురేష్, వీఆర్వో అంజి పాల్గొన్నారు.



## వరికపూడిసెలా పూర్తవుతుంది..

ప్రజాశక్తి- మాచర్ల

ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తూ అభివృద్ధి దిశగా రాష్ట్రం ముందుకెళ్తోందని మాచర్ల మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ యాగంటి మల్లికార్జునరావు అన్నారు. పట్టణంలోని 17వ వార్డులో మంగళవారం ఆయన పింఛన్ల పంపిణీలో పాల్గొన్నారు. కొత్త సంవత్సరంలో అమరావతి పునర్నిర్మాణం, సాగునీటి ప్రాజెక్టులను, రాయలసీమ ప్రాజెక్టులను పునర్ నిర్మించి రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేయనున్నట్లు చెప్పారు. ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి గడిచిన ఆరు నెలల్లో మాచర్ల నియోజకవర్గంలో రూ.300 కోట్లతో పలు అభివృద్ధి పనులను చేపట్టారని చెప్పారు. వరికపూడిసెలను కూడా పూర్తి చేస్తారని అన్నారు.

ప్రజాశక్తి - రెంటచింతల

మండలంలోని 11 గ్రామాల్లో మొత్తం 6801 మంది పింఛను లబ్ధిదారులు ఉండగా 6772 మందికి అనుమతి లభించిందని, వీరిలో 6420 మందికి పింఛను నగదును మంగళశారం సాయంత్రం ఐదు గంటలకల్లా అందజేశామని ఎంపిడిఓ సరోజినీదేవి తెలిపారు. పొలాలు వెళ్లిన కూలీలు వచ్చేవరకు సచివాలయ సిబ్బంది కార్యదర్శులు వేచి ఉన్నారని, పంపిణీ కొనసాగుతుందని చెప్పారు.





# కేంద్ర మంత్రి అమిత్‌షా రాజీనామా కోసం నిరసన

ప్రజాశక్తి - క్రోసూరు

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌పై కేంద్ర హోం మంత్రి అమిత్‌షా వ్యాఖ్యలను ఖండిస్తూ ఆయన తన మంత్రి పదవికి రాజీనామా చేయాలని సిపిఎం, ఇతర వామపక్షా పార్టీలు, ప్రజా సంఘాలు డిమాండ్ చేశాయి. ఈ మేరకు మండల కేంద్రమైన క్రోసూరులోని అంబేద్కర్ సెంటర్ వద్ద వామపక్షాల ఆధ్వర్యంలో నిరసన చేపట్టగా బిఎస్‌పి నియోజకవర్గ గనుపల్లి శేఖర్ మాట్లాడుతూ బిజెపి మతోన్మాద భావజాలంతో ప్రజల మధ్య చిచ్చు పెట్టాలనే ధోరణికి అంబేద్కర్ రాసిన రాజ్యాంగం అడ్డుగా ఉండటం వలనే ఈ రకమైన పద్ధతిలో మాట్లాడుతున్నారని అన్నారు. సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.రవిబాబు మాట్లాడుతూ భారత రాజ్యాంగాన్ని బిజెపి-ఆర్ఎస్ఎస్ ఎప్పుడు వ్యతిరేకిస్తూనే ఉంటాయన్నారు. రాష్ట్రాల హక్కులను హరించే విధంగా జమిలి ఎన్నికలను ముందుకు తెస్తోందని అన్నారు. సిపిఐ మండల కార్యదర్శి నాగేశ్వరావు మాట్లాడుతూ అమిత్ షా వ్యవహరించిన తీరును మన ఆంధ్రప్రదేశ్‌లోని రాజకీయ పార్టీలు కూడా ఖండించాలన్నారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి టి.హనుమంతరావు, నాయకులు ఆంజనేయులు, వెంకటేశ్వర్లు, ఏషియా, గోపికృష్ణారెడ్డి, టిడిపి నాయకులు కృష్ణారావు, సిపిఐ నాయకులు పెద్దబ్బాయి, యాదగిరి, దేవదాసు, రాజు, ఏడుకొండలు రామకృష్ణ పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ముప్పాళ్ల

అమిత్ షా చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని, దేశ ప్రజలకు క్షమాపణలు చెప్పాలని మండలంలోని మాదలలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద సిపిఎం, ప్రజా సంఘాలు నిరసన వ్యక్తం చేశాయి. సిపిఎం మండల కార్యదర్శి జి.బాలకృష్ణ మాట్లాడుతూ రాజ్యాంగాన్ని కాపాడాల్సిన స్థానంలో ఉండి రాజ్యాంగానికి భిన్నంగా మాట్లాడటం నీచమైన చర్యన్నారు. అమిత్ షా పార్లమెంటు సభ్యత్వానికి, హోంమంత్రి పదవికి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఎం.వెంకటరెడ్డి, పి.సైదాఖాన్, జి.జాలయ్య, డి.చిన్నారావు, జి.రామారావు పాల్గొన్నారు.



పరీక్షలపై విద్యార్థులకు వివరిస్తున్న ఎంఇఒ టి.వెంకట్రావు

# లక్ష్యాన్ని ఎంచుకొని చదివితే మంచి మార్కులు

ప్రజాశక్తి - పెదకూరపాడు

పదో తరగతి పరీక్షలు రాయనున్న విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకొని చదివితే మంచి మార్కులు వస్తాయని, స్టడీ మెటీరియల్ ప్రశ్నపత్రాలు ఎంతో ఉపయోగపడతాయని మండల విద్యాశాఖ అధికారి-2 తాటిచెట్టి సత్యనారాయణ అన్నారు. మండలంలోని గారపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు రాయపూడి సెల్ఫ్ ఫౌండేషన్ ప్రతినిధులు రాయపూడి రామకృష్ణ (లండన్), రాయపూడి వెంకటేశ్వరరావు (అమెరికా)ల సహకారంతో జనచైతన్య సమితి ఆధ్వర్యంలో స్టడీ మెటీరియల్‌తో పాటు మోడల్ పేపర్లను మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఇఒ సత్యనారాయణ మాట్లాడుతూ పరీక్షల సమయం దగ్గర పడుతున్న నేపథ్యంలో ప్రతి విద్యార్థి కష్టపడి ఇష్టంతో చదువుకోవాలని సూచించారు. ఉత్తమ మార్కులు సాధించి తల్లిదండ్రులకు, చదువుకున్న పాఠశాలకు విద్య నేర్పిన గురువులకు మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షులు ఎం.సాగర్, పెదకూరపాడు జెడ్‌పి పాఠశాల హెచ్ఎం కె.వెంకటరమణ, 75 తాళ్లూరు జెడ్‌పి పాఠశాల హెచ్ఎం ఎ.శ్రీనివాస్‌రెడ్డి, గారపాడు జెడ్‌పి పాఠశాల హెచ్ఎం టి.నాగమల్లేశ్వరరావు, పాటిబండ్ల ఆర్‌సిఎం పాఠశాల ఉపాధ్యాయులు కె.నాగభూషణ్‌రెడ్డి, ఉపాధ్యాయులు ఆర్.సాంబశివరావు, జన చైతన్య సమితి కో-ఆర్డినేటర్ వి.అనిల్ కుమార్ పాల్గొన్నారు.




## పంటల బీమాకు ఈ-క్రాప్ తప్పనిసరి

ప్రజాశక్తి-ముప్పాళ్ల

మండలంలోని రుద్రవరంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి ఎం.అరుణ మాట్లాడుతూ మొక్కజొన్న, శెనగ, వరి సాగుచేస్తున్న రైతులు పంట నమోదు చేయించుకోవాలని సూచించారు. వరిని పంటల బీమా కింద నమోదు చేసుకోవాలంటే ఈ-క్రాప్ తప్పనిసర న్నారు. దాళ్వా వరి వేసే రైతులు పంటల బీమా కోసం ఎకరానికి రూ.630 చెల్లించాల్సి ఉంటుందని చెప్పారు.

## విద్యార్థుల్లో సృజనాత్మక వెలికితీయాలి

ప్రజాశక్తి - రెంటచింతల

విద్యార్థుల్లో దాగివున్న సృజనాత్మకతను వెలికి తీయాలని ఎంఇఒ-2 శివనాగేశ్వరరావు అన్నారు. మండల కేంద్రమైన రెంటచింతలలోని వైఆర్ఎస్ హైస్కూల్లో మండల స్థాయి సైన్స్, ఫెయిర్ పోటీలను మంగళవారం నిర్వహించారు. ఎగ్జిబిషన్లో సెయింట్ జోసెఫ్ పాఠశాలకు చెందిన పి.జ్యోతి, క్విజ్‌లో రెంటాల జెడ్‌పి పాఠశాలకు చెందిన పి.సుప్రియ, ఎన్.మాధవి, జి.చైతన్య, బుక్ ఫెయిర్‌లో ఏపీ మోడల్ స్కూల్‌కు చెందిన జి.అనిల్‌రెడ్డి విజేతలుగా నిలిచారు. కార్యక్రమంలో తొమ్మిది హైస్కూళ్ల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# పొన్నూరులో న్యాయవాదిపై పోలీసుల దాడికి నిరసన



ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

రాజ్యాంగేతర శక్తిగా వ్యవహరించిన పొన్నూరు పోలీసులపై కఠిన చర్యలు తీసుకోవాలని సత్తెనపల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షులు కంబాల అనిల్ కుమార్ డిమాండ్ చేశారు. సత్తెనపల్లిలో నాలుగు న్యాయస్థానాల్లో న్యాయవాదులు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం విధులు బహిష్కరించారు. తాలూక న్యాయస్థానం ప్రాంగణంలోని న్యాయదేవత విగ్రహం వద్ద నిరసనలో అనిల్‌కుమార్ మాట్లాడుతూ పొన్నూరు బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాది బేతాళ ప్రకాశరావుపై అక్కడి సిఐ పి.ఎస్.రవి కుమార్, ఎస్ఐ రాజ్‌కుమార్, కానిస్టేబుల్ గోపీ, కంప్యూటర్ ఆపరేటర్ మల్లికార్జునరావు హంటర్‌తో దాడి, వృత్తిని కించపరిచేలా దూషించడంపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు పి.వెంకట కోటయ్య, బి.ఆదినారాయణ, బి.శ్రీనివాసబాబు, కె.వీరభాస్కర రెడ్డి, డి.శ్రీనివాసరావు, ఇతర న్యాయవాదులు పాల్గొన్నారు.

### న్యాయవాది బూసిసుబ్బారావుకు నివాళి



సీనియర్ న్యాయవాది బూసి సుబ్బారావు 8వ వర్ధంతి సత్తెనపల్లి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి న్యాయవాదులు, న్యాయవాది గుమస్తాలు సుబ్బారావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సత్తెనపల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షులు కంబాల అనిల్‌కుమార్, న్యాయవాదులు డి.బాపయ్య చౌదరి, బి.నరశింహారావు, ఎం.వేదాద్రి, జె.అజయ్, ఎన్.వేణుగోపాల్, టి.భావన్నారాయణ, కె.శ్రీనివాస్ పాల్గొన్నారు.

# జెకెసి కాలేజి రోడ్డులో సెంట్రల్ డివైడర్

ప్రజాశక్తి-గుంటూరు



జెకెసి కాలేజి రోడ్డును పరిశీలిస్తున్న కమిషనర్

జెకెసి కాలేజి రోడ్డులో సెంటర్ డివైడర్, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చర్యలు చేపట్టాలని, మార్కింగ్ చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు జిఎంసి ఎస్‌ఈని ఆదేశించారు మంగళవారం కమిషనర్ లాడ్జి సెంటర్‌లోని హెచ్‌ఎల్‌ఆర్ ట్యాంక్, ఎస్‌విఎన్ కాలనీ, జెకెసి కాలేజి రోడ్, శ్యామలా నగర తదితర ప్రాంతాల్లో పర్యటించి అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు.. గుంటూరులో త్రాగునీటి సరఫరాలో ఇంజినీరింగ్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని, అనధికార నీటి విక్రయాలకు అడ్డుకట్ట వేయకుంటే చర్యలు తప్పవని కమిషనర్ అన్నారు. హెచ్‌ఎల్‌ఆర్‌లో నీటి సరఫరా ట్యాంకర్ల రిజిస్టర్ తనిఖీ చేసి, అనధికార నీటి విక్రయాలకు చెక్ పెట్టాలన్నారు. పర్యటనలో కార్పొరేటర్ ఈ.వరప్రసాద్, ఎస్‌ఈ నాగమల్లేశ్వరరావు, సిటి ప్లానర్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

**వాయుకాలుష్యం నియంత్రణకు చర్యలు..**

నగరంలో వాయు కాలుష్యం నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు అన్నారు. మంగళవారం స్థానిక ట్రావెలర్స్ బంగ్లా, జిజిహెచ్ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ఎయిర్ క్వాలిటి టెస్టింగ్ పాయింట్స్‌ని కమిషనర్ పరిశీలించారు. నేషనల్ ఎయిర్‌క్లీన్ ప్రోగ్రాంలో గుంటూరులో వాయుకాలుష్యం నియంత్రణకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. అందులో భాగంగానే ఇప్పటికే జెకెసి కాలేజి రోడ్, బ్రాడీపేట 4వ లైన్‌లో ఎండ్ టు ఎండ్ వరకు బిటి లేయర్ తో నూతన రోడ్లను నిర్మాణం చేశామన్నారు. నగరంలో వాయు కాలుష్య పరిశీలనకు ట్రావెలర్స్‌బంగ్లా, జిజిహెచ్, ఆటోనగర్ ఏపిఐఐసి భవనం, నలంద నగర్‌లో ఎయిర్ క్వాలిటి టెస్టింగ్ పాయింట్స్ ఏర్పాటు చేశామన్నారు.పర్యటనలో ఎస్‌ఈ నాగ మల్లేశ్వరరావు, ఈఈ సుందర్రామిరెడ్డి, కోఆర్డినేటర్ కోమలి, తదితరులు పాల్గొన్నారు.

**ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి...**

గుంటూరు నగరపాలకసంస్థ హౌసింగ్ లేఅవుట్స్‌లో ఇళ్ళ నిర్మాణ పనులు వేగవంతం చేయాలని, ఎమినిటి కార్యదర్శులు లబ్దిదారులతో జియోట్యాగ్ చేయించడంలో చొరవ చూపాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. మంగళవారం జిఎంసి కౌన్సిల్ హాలోల ఇంజినీరింగ్, హౌసింగ్ డిపార్ట్మెంట్ అధికారులు, ఎమినిటి కార్యదర్శులు, కాంట్రాక్టర్లతో హౌసింగ్ లేఅవుట్స్‌లో ఇళ్ళ నిర్మాణ పనులపై సమీక్షా సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ గడువులోగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని, ఇళ్ల నిర్మాణ పనులకు అవసరమైన గ్రావెల్‌కు తగిన ఏర్పాట్లు చేస్తామన్నారు. సమావేశంలో అదనపు కమిషనర్ సిహెచ్.ఓబులేసు, హౌసింగ్ పిడి ప్రసాద్, డిప్యూటీ కమిషనర్ టి.వెంకట కష్ణయ్య, హౌసింగ్ ఈఈ శంకర్రావు, ఉపా సెల్ పిఓ రామారావు, డిఈఈలు, ఏఈలు, ఎమినిటి కార్యదర్శులు పాల్గొన్నారు.

# రూ.3.79 కోట్ల బడ్జెట్‌కు కౌన్సిల్ ఆమోదం

ప్రజాశక్తి-తెనాలిరూరల్



సమావేశంలో మాట్లాడుతున్న రాధిక

తెనాలి మున్సిపల్ చైర్పర్సన్ తాడిబోయిన రాధిక అధ్యక్షతన మున్సిపల్ కౌన్సిల్ హాల్లో మంగళవారం నిర్వహించిన ప్రత్యేక బడ్జెట్ సమావేశం ప్రశాంతంగా ముగిసింది. కౌన్సిల్ సభ్యులు రావడం అలస్యంతో సమావేశం అనుకున్న సమయంకన్నా 30 నిమిషాలు ఆలస్యంగా ప్రారంభమయ్యింది. సాధారణ సమావేశంలో తెనాలి పట్టణ అభివృద్ధి, రోడ్ల విస్తరణ, మరమ్మతులు, వీధి దీపాలు, మరుగుదొడ్లు, పారిశుధ్యం సమస్యలపై సభ్యులు చర్చించారు. 2024-25 సంవత్సరంలో సవరించిన బడ్జెట్ అంచనాలు ఆమోదంతో పాటు పురపాలక సంఘంలో సాధారణ, ప్రాథమిక విద్య నిధులకు సంబంధించి 2025-26 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్ అంచనాల ప్రతిపాదనలను కౌన్సిల్ తెలియపరచగా సభ్యులు ఆమోదం తెలిపారు. ప్రత్యేక సమావేశానికి ముందు జరిగిన సాధారణ సమావేశంలో 11 వ అంశాన్ని వాయిదా వేశారు. మిగిలిన 61 అంశాలను సభ్యులు ముక్తకంఠంతో ఆమోదం తెలిపారు. పట్టణ సమస్యలపై వైసిపి, టిడిపి కౌన్సిలర్లు ఏకరువు పెట్టారు. పట్టణంలో రోడ్లు మరమ్మతులు పనులు నత్తనడక సాగుతున్నాయని ప్రశ్నించారు. తవ్విన రోడ్లను అసంపూర్తిగా వదిలేసిన కాంట్రాక్టర్ల తీరుపై తీవ్రంగా మండిపడ్డారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా కాట్రాక్టర్లకు కొమ్ములొచ్చాయని టిడిపి సభ్యులు పసుపులేటి త్రిమూర్తులు, అడుసుమిల్లి వెంకటేశ్వరరావు, దేసు యుగంధర్ ప్రశ్నించారు. దాఖలైన టెండర్లపై నిర్ణయం, పూర్తి చేసిన పనులకు ర్యాటిఫికేషన్, 2024 నవంబరు నెలకు సంబంధించిన జమా ఖర్చుల వివరాలను ట్రెజరీ అధికారులు వెల్లడించారు. 2024 - 25 ఆర్థిక సంవత్సరానికి గాను రూ 3.79 కోట్ల మిగులు బడ్జెట్‌తో ప్రవేశపెట్టిన కౌన్సిల్ ఆమోదం తెలిపారు. ఆస్తి పన్ను, నీటి సరఫరా, యం ఆర్, షాప్ రూమ్ అద్దెలు, డి అండ్ ఓ ట్రేడ్స్ లైసెన్స్, టౌన్ ప్లానింగ్ వసూళ్లు, ప్రాపర్టీ మ్యుటేషన్ చార్జెస్, సర్ చార్జి, స్టాంప్ డ్యూటీల ద్వారా రూ 3.90 కోట్లు ఆదాయం సమకూరిందన్నారు. ఇక ఖర్చుల్లో జీతభత్యాలు, పురపాలక నిర్వహణ ఖర్చులు, విద్యుత్ చార్జీలు, అభివృద్ధి పనుల చెల్లింపులు, ఐటీ, జీఎస్టీ ఎన్ఎసి, వార్డ్ సెక్రటేరియట్ నిర్వహణ, ఇతర చార్జీల క్రింద రూ 3.7 కోట్లు ఖర్చయ్యిందని ఇది ప్రతి ఏటా జరిగేదనని కమిషనర్ బండి శేషన్న తెలిపారు. రూ 4.63 కోట్లు ముగింపు నిల్వ ఉందన్నారు.



అధికారులను మూకుమ్మడిగా ప్రశ్నిస్తున్న కౌన్సిల్ సభ్యులు

# రైతులకు నిర్ధిష్ట సమయంలో ఎరువుల సరఫరా : మంత్రి మనోహర్

ప్రజాశక్తి-తెనాలిరూరల్

రైతుల సమయం వృధా కాకుండా ఎరువులు అందించే చర్యలు వేగవంతం చేస్తున్నట్లు రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. తెనాలి పర్యటనలో భాగంగా మంగళవారం తెనాలి మార్కెట్ యార్డులోని గుంటూరు జిల్లా కో ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటి లిమిటెడ్ గోదామును మంత్రి తనిఖీ చేశారు. గోడౌన్‌లో స్టాక్ నిల్వలను పరిశీలించిన మంత్రి, రైతులకు సరఫరా చేస్తున్న డిఎపి, యూరియ తదితర ఎరువుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. మంత్రి వద్దకు వచ్చిన రైతులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. వ్యవసాయ అధికారుల ఆధ్వర్యంలో కొల్లిపర, మున్నంగి, నందివెలుగు ప్రాంతాల్లో రైతులకు తక్షణమే ఎరువులు అందించే ఏర్పాటు చేస్తామన్నారు. రైతుల సంక్షేమానికి కట్టుబడిన కూటమి ప్రభుత్వం ఎరువుల సరఫరాలో సమయపాలనకు ప్రాధాన్యత ఇస్తామన్నారు. ముఖ్యంగా రైతులకు డిఎపి, యూరియ వంటి కీలక ఎరువులను సరఫరా చేసే ప్రక్రియను వ్యవసాయ అధికారి ద్వారా చేపడతామన్నారు. ఆందోళన చెందుతున్న రైతులకు ఖచ్చితమైన సమాచారం ద్వారా ఎరువులు విక్రయించేందుకు చర్యలు చేపడతామన్నారు. ఎరువుల లోడ్లు రాగానే రైతులకు సమాచారం అందించడం, టోకెన్లు ద్వారా ఎరువుల సరఫరా ప్రక్రియ సజావుగా జరిగేలా సమర్థవంతమైన పద్ధతులు అమలు చేయడం, రైతు ఫిర్యాదులపై స్పందించి వారికి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. రైతులు సంతృప్తికరంగా వ్యవసాయ పనులను కొనసాగించేందుకు కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తుందని హామీ ఇచ్చారు.



గోదాములలో ఎరువుల నిల్వలను పరిశీలిస్తున్న మంత్రి మనోహర్

## ఎసిసి కార్మికులకు మంత్రి లోకేష్ ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

ఎన్నికల సందర్భంగా తాడేపల్లి పట్టణంలోని ఏసీసీ కార్మికుల సమస్యను పరిష్కరిస్తానని చెప్పిన ఎమ్మెల్యే లోకేష్ మాట నిలబెట్టుకోవాలని, సిఐటియు తాడేపల్లి డివిజన్ కార్యదర్శి వేముల దుర్గారావు డిమాండ్ చేశారు. మంగళవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని ఎసిసి కార్మికుల రిలే నిరాహార దీక్షలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా దుర్గారావు మాట్లాడుతూ పండుగ పూట కూడా ఎసిసి కార్మిక కుటుంబాలు ఆకలితో అలమటిస్తున్నాయని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఎసిసి కార్మికుల సమస్యను పరిష్కరిస్తానని ఆనాడు లోకేష్ కార్మికులకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని ఆయన అన్నారు. గత 31 సంవత్సరాలగా ఎసిసి కార్మికులు తమకు రావాల్సిన నష్టపరిహారం కోసం న్యాయపోరాటం చేస్తున్నారని, పాలక పక్షాలు, అధికారులు కార్మికుల పట్ల నిర్లక్ష్య ధోరణితో వ్యవహరించారని ఆయన ఆవేదన చెందారు. తక్షణమే ఎసిసి కార్మికుల సమస్యను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. ఈ దీక్షలలో రమాదేవి, శా రమ్మ, సామ్రాజ్యం, హిమంబి, శారద కూర్చున్నారు. ఈ కార్యక్రమంలో ఎసిసి కార్మికుల పోరాట కన్వీనర్ కూరపాటి స్టీవెన్, కే ఆదినారాయణ, సిఐటియు నాయకులు ఎమ్మెల నరసింహారావు, సూర్య ప్రకాష్, ఆశీర్వాదం, భాష, సుబ్బారావు, కృష్ణ గురవయ్య తదితరులు పాల్గొన్నారు.



ఎసిసి కార్మికుల దీక్షలను ప్రారంభించి, మాట్లాడుతున్న సిఐటియు తాడేపల్లి డివిజన్ కార్యదర్శి వేముల దుర్గారావు



కేక్ కట్ చేస్తున్న శ్రీనివాసరావు, విద్యార్థులు

## చిల్డ్రన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో నూతన సంవత్సర వేడుకలు

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం మహాత్మా గాంధీ ఇన్నర్ రింగ్‌రోడ్డులోని ప్రగతి నగర్‌లో నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకల్లో విద్యార్థినీ విద్యార్థులు కోలాటం, ఆటపాటలతో ఉత్సాహంగా పాల్గొన్నారు. నిర్వాహకులు కె. శ్రీనివాసరావు, ట్యూషన్ మాస్టర్ బ్రహ్మానందం విద్యార్థులు కొత్త సంవత్సరంలో కొత్త లక్ష్యాలతో ముందుకు వెళ్లాలన్నారు. ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలని కోరారు. అనంతరం నూతన సంవత్సర కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సంగిశెట్టి సన్నీ, కన్నా పాల్గొన్నారు.



## వాగు విస్తరణకు పొలల్లో, ప్లాట్లలో మార్కింగ్

**రైతుల అభిప్రాయాలను తీసుకోవాలని సిఆర్‌డిఎ డిప్యూటీ కలెక్టర్‌ను కలిసిన రైతు సంఘం నాయకులు, రైతులు**

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

కొండవీటి వాగు విస్తరణ పేరుతో 115 మీటర్లు వెడల్పు కు అధికారులు మార్కింగ్ ఇచ్చే క్రమంలో ఆందోళనకు గురైన తాడేపల్లి మండల పరిధిలోని ఉండవల్లి, పెనుమాక రైతులు మంగళవారం పెనుమాక గ్రామంలోని సిఆర్డిఏ డిప్యూటీ కలెక్టర్ చిన్ని కృష్ణను కలిశారు. ఈ సందర్భంగా రైతు సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షులు జొన్న శివశంకరరావు మాట్లాడుతూ రాజధాని ప్రాంతంలో కొండవీటి వాగు వెడల్పు పేరుతో రైతుల పొలాలలో, ఫ్లాట్లలో అధికారులు మార్కింగ్ ఇవ్వడంతో రైతులు ఆందోళనకు గురయ్యారని అన్నారు. కనీసం ఆ ప్రాంత రైతుల అభిప్రాయ సేకరణ చేసిన తర్వాతే అధికారులు విస్తరణ పనులు చేపట్టాలని సిఆర్డిఏ డిప్యూటీ కలెక్టర్‌ను ఆయన కోరారు. స్పందించిన డిప్యూటీ కలెక్టర్ మూడు రోజుల తర్వాత పూర్తి సమాచారం రైతులకు తెలియ జేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఉండవల్లి రైతు సంఘం నాయకులు టి బక్కిరెడ్డి, పద్మనాభ రెడ్డి, మున్నంగి శ్రీధర్ రెడ్డి, తక్కెళ్ళ పాటి సంజీవరెడ్డి, కనకం కోటేశ్వరరావు ఉన్నారు.

## శ్మశాన వాటిక ఏర్పాటుకు వినతి

ప్రజాశక్తి-తెనాలిరూరల్

బుర్రిపాలెం మాదిగపల్లె శ్మశానవాటిక కు అదనపు స్థలం కేటాయించాలని కోరుతూ ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు కిన్నెర నాగరాజు మాదిగ జిల్లా కలెక్టర్ కు మంగళవారం వినతిపత్రం సమర్పించారు. బుర్రిపాలెం గ్రామ సదస్సుకు హాజరైన జిల్లా కలెక్టర్ నాగమణి తో బుర్రిపాలెం మాదిగపల్లి నిర్వాసితులు మాట్లాడారు. బుర్రిపాలెం ఇందిరానగర్ కాలని ఎస్సి మాదిగ పల్లె కు సంబంధించి బరియల్ గ్రౌండ్ ఏర్పాటుకు గతంలో 20 సెంట్లు స్థలం కేటాయించగా అందులో ఐదు సెంట్లు వరకు బళ్ళదారి వుందని విజేష్ రెవెన్యూ సదస్సులో విన్నవించారు. ప్రస్తుతం 15 సెంట్లలో మాత్రమే బరియల్ గ్రౌండ్ వుందన్నారు. సుమారు 350 కుటుంబాలు నివసిస్తున్న పల్లెలో స్మశాన వాటిక సరిపోవడంలేదన్నారు. మాదిగ పల్లె నుంచి బరియల్ గ్రౌండ్ వరకు మధ్యలో దారి చాలా ఇరుకుగా, ఇబ్బందికరంగా వుందన్నారు. వర్షాకాలంలో ఆరోడ్డు మరింత ప్రమాదంగా మారుతుందని ఆవేదన వ్యక్తంచేశారు. తగిన విచారణ జరిపి శ్మశానవాటికకు అదనపు స్థలం, పక్క రోడ్డు నిర్మించాలని తద్వారా మాదిగపల్లి ఆత్మగౌరం కాపాడాలని కలెక్టర్ ను కోరారు.

## ఆర్‌విఆర్ ప్రొఫెసర్ నీలిమకు డాక్టరేట్

ప్రజాశక్తి-గుంటూరు



ఆర్‌విఆర్ అండ్ జెసి ఇంజినీరింగ్ కాలేజి, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎన్.నీలిమకు జెఎన్‌టియు హైదరాబాద్ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. నీలిమ ' స్కెలిటెన్ బేస్డ్ షేప్ రిప్రజెంటేషన్ టెక్నిక్స్ ఫర్ అబ్జెక్ట్ రికగ్నిషన్' అనే అంశంపై ఆర్‌విఆర్ కాలేజి ఐటి విభాగాధిపతి డాక్టర్ ఎ.శ్రీకృష్ణ పర్యవేక్షణలో పరిశోధన చేశారు. ఈ సందర్భంగా కళాశాలలో పిహెచ్‌డి కలిసిన స్టాప్ 154 మంది ఉన్నారని కళాశాల అధ్యక్షులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ తెలిపారు. డాక్టరేట్ పొందిన సందర్భంగా కళాశాల కార్యదర్శి రాయపాటి గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్, డైరెక్టర్లు డాక్టర్ కె.రవీంద్ర, డాక్టర్ ఎన్.వి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.




గుంటూరులో ర్యాలీ నిర్వహిస్తున్న న్యాయవాదులు

## న్యాయవాదిపై పోలీసుల దాడికి నిరసన

ప్రజాశక్తి-గుంటూరు లీగల్

గుంటూరు జిల్లా పొన్నూరు న్యాయవాది బేతాళం ప్రకాశరావు పై పొన్నూరు సిఐ రవికిరణ్, ఎస్ఐ రాజ్‌కుమార్, పోలీసులు మూకుమ్మడిగా దాడి చేసిన ఘటనకు నిరసనగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మం గళవారం న్యాయవాదులు నిరసన తెలిపారు. గుంటూరులో జిల్లా కోర్టు నుంచి ఎస్‌పి కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. తెనాలి, పొన్నూరు నుంచి పెద్ద సంఖ్యలో న్యాయవాదులు ర్యాలీలో పాల్గొన్నారు. ఎస్‌పి సతీష్‌కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. పిడుగురాళ్ల, మాచర్ల తదితర ప్రాంతాల్లో కూడా న్యాయవాదులు విధులు బహిష్కరించారు. సిఐ, ఎస్ఐపై చర్యలు తీసుకోవాలని వారిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని న్యాయవాదులు డిమాండ్ చేశారు. బార్ ఫెడరేషన్ చైర్మన్ కాసు వెంకటరెడ్డి, సీనియర్ న్యాయవాదులు మధిర నాగేశ్వరరావు, కిరణ్, శాంతకుమార్, కెవికె సురేష్, పొన్నూరు బార్ అసోసియేషన్ అధ్యక్షులు పొందుగల జయరాజ్, సీనియర్ న్యాయవాది రాయల్ తదితరులు పాల్గొన్నారు.



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న నేతాజి, రామారావు, శివరామకృష్ణ తదితరులు

## ప్రజాశక్తి కేలండర్, డైరీ ఆవిష్కరణ

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక బ్రాడీపేటలోని ప్రజాశక్తి దినపత్రిక కార్యాలయంలో మంగళవారం ముందస్తు నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. ప్రజాశక్తి జిల్లా కన్వీనర్ బి.సుధాకిరణ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సిపియం జిల్లా కార్యదర్శి వై.నేతాజి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పాశం రామారావు, ప్రజాశక్తి జనరల్ మేనేజర్ జి.శివరామకృష్ణ పాల్గొని నూతన సంవత్సర క్యాలెండర్, డైరీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నేతాజి, పాశం రామారావు మాట్లాడుతూ సామాజిక బాధ్యతతో పత్రికా విలేకరుల ప్రజాసమస్యలను వెలికి తీయటానికి చేస్తున్న కృషి అభినందనీయం అన్నారు. కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలు అనుసరిస్తున్న నేపథ్యంలో ప్రజాశక్తి వంటి ప్రజల పక్షం వహించే పత్రికలు మరింత అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉందన్నారు. బిజెపి మతోన్మాద విధానాలతో ప్రజల మధ్య చీలిక తెచ్చే ప్రయత్నం చేస్తుందని, మరోవైపు లాభాల్లో నడిచే ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్లకు ధారాదత్తం చేస్తుందని విమర్శించారు. కూటమి సర్కారు ప్రజా సమస్యలు, ఇచ్చిన హామీలు విస్మరించిందని, పేదలపై భారాలు మోపుతుందన్నారు. శివరామకృష్ణ మాట్లాడుతూ సిబ్బందికి, పాఠకులకు నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌ఛార్జి సిహెచ్.శంకర్, సిటీ ఇన్‌ఛార్జి కె.సుధీర్, పల్నాడు ఇన్‌ఛార్జి ఎన్.కృష్ణ, మూర్తి, జి ప్రభాకర్, సాగర్, ప్రశాంత్, ఖాజా, బుజ్జిరాణి తదితరులు పాల్గొన్నారు.



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, ఇతర నాయకులు

## జెవివి నూతన సంవత్సర కేలండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-గుంటూరు

జన విజ్ఞాన వేదిక నూతన సంవత్సరంలో శాస్త్ర విజ్ఞానాన్ని సామాన్య ప్రజలకు చేరువ చేసే కృషి చేయాలని ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు అన్నారు. మంగళవారం స్థానిక బ్రాడీపేటలోని యుటిఎఫ్ కార్యాలయంలో జెవివి నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ విద్యార్థుల్లో ఆలోచనా శక్తిని రేకెత్తించే, ప్రశ్నించే తత్వాన్ని పెంపొందించాలన్నారు. ప్రశ్నించే తత్వం ద్వారానే మూఢనమ్మకాలను పారద్రోలవచ్చని అన్నారు. జెవివి జిల్లా అధ్యక్షులు టి.జాన్‌బాబు మాట్లాడుతూ కొత్త సంవత్సరానికి యువ మద్యంతో స్వాగతం పలకవద్దని కోరారు. మద్యపానం వల్ల కలిగే నష్టాలపై విస్తృత ప్రచారం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జెవివి నాయకులు బి.ప్రసాద్, జి.వెంకటరావు, యం.క్యూరి, టి.చాందిని, టి.ఆర్.రమేష్, శివపూర్ణయ్య, జివివి.సుబ్బరాయుడు, జి.శాంతమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## ఇళ్ల స్థలాల దరఖాస్తులపై కలెక్టర్ సమీక్ష

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు తూర్పు, పశ్చిమ, ప్రత్తిపాడు అసెంబ్లీ నియోజకవర్గాల ఎమ్మెల్యేలు వారి నియోజకవర్గాల్లోని పేదలకు ఇళ్లు, ఇళ్ళ స్థలాలు మంజూరు చేయటానికి ఇచ్చిన వినతుల మేరకు మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, జేసీ ఎ.భార్గవ్‌తేజ, జిఎంసి కమిషనర్ పులి శ్రీనివాసులుతో కలిసి గృహనిర్మాణ , టిడ్కో , నగరపాలక సంస్థ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కొర్నెపాడు లేఅవుట్‌లో ఇల్లు మంజూరు చేసిన 20 వేల గృహాలను రీవెరిఫికేషన్ చేయటానికి జీయంసీ కమిషనర్ ఆధ్వర్యంలో టీముల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. రీవెరిఫికేషన్ అనంతరం జాబితాను రూపొందించాలని, ఆ జాబితాను టిడ్కో ఇళ్లు మంజూరు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి

అయిన లబ్దిదారుల జాబితాతో చెక్‌చేసి లబ్దిదారుల అర్హతను ధృవీకరించాలన్నారు. అర్హత కలిగిన వారికి ఇళ్ల స్థలాల కోసం ప్రతిపాదనలు సమర్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఓ కె.శ్రీనివాసరావు, హౌసింగ్ పీడీ ప్రసాద్, ఈఈ శంకరరావు , టిడ్కో ఈఈ ప్రసాద్, జిఎంసి అడిషనల్ కమిషనర్ చల్లా ఓబులేసు పాల్గొన్నారు.

నంబూరు ఎస్‌పివి జడ్‌పి విద్యార్థులు

## వర్సిటీలో ఇండస్ట్రియల్ విజిట్

ప్రజాశక్తి - ఎఎన్‌యు





ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఇంజనీ రింగ్ కళాశాలలో మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ విభాగంలోని ప్రయోగశాలలను నంబూరు ఎస్‌పివి జడ్పీహెచ్‌ఎస్ స్కూల్ విద్యార్థులు మంగళవారం ఇండస్ట్రియల్ విజిట్ (ఒకేషనల్ ఎడ్యుకేషన్ ట్రేడ్స్ ఎలక్ట్రానిక్స్ అండ్ మెకానికల్) చేశారు. అందులో భాగంగా మెకానికల్ వర్క్ షాప్ , మెషిన్ షాప్, ఐ సి ఇంజన్స్ ల్యాబ్, డ్రోన్ టెక్నాలజీ ఇంక్యుబేషన్ సెంటర్ , మైక్రో ప్రాసెసింగ్ ల్యాబ్, బేసిక్ ఎలక్ట్రికల్ ల్యాబ్, ఎలక్ట్రికల్ మిషన్స్ ల్యాబ్ లను సందర్శించారు. ఈ వర్క్ షాప్ లో విద్యార్థులు ఎంతో ఉత్సాహంతో పరికరాలను పరిశీలించి అడిగి తెలుసుకున్నారు. సందర్శన ఎంతో సంతోషంగా విజ్ఞానదాయకంగా ఉందని తెలియజేశారు. సందర్శనకు అనుమతి మంజూరు చేసిన విశ్వవిద్యాలయ విసి ప్రొఫెసర్ గంగాధర రావు, రెక్టార్ ప్రొఫెసర్ రత్న షీలామణి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి. సింహాచలం తదితరులకు ఎస్పీవీ జడ్పీహెచ్‌ఎస్ స్కూల్ ఉపాధ్యాయులు రాచర్ల శ్రీను, షేక్ బాజీ, ముని, సుజాత కృతజ్ఞతలు తెలియజేశారు.

## 4న విజ్ఞాన్‌లో అభ్యుదయ రైతులకు పురస్కారాలు

ప్రజాశక్తి-గుంటూరు

వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలో 4వ తేదీన యూనివర్సిటీ, రైతునేస్తం ఫౌండేషన్ల సంయుక్త ఆధ్వర్యంలో 'అభ్యుదయ రైతుల పురస్కారాలు-2025' అందచేయనున్నట్లు వర్సిటీ వీసీ ప్రొఫెసర్ పీ.నాగభూషణ్ తెలిపారు. ఈ సందర్భంగా పురస్కార సభకు సంబంధించిన పోస్టర్లను విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, వైస్‌చైర్మన్ లావు శ్రీకృష్ణదేవరాయలు, రైతునేస్తం ఫౌండేషన్ చైర్మన్ యడ్లపల్లి వెంకటేశ్వరరావు ఆవిష్కరించారు. పురస్కారాల సభకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ శాఖ సంచాలకులు ఎస్.డిల్లీరావు హాజరవుతున్నారని తెలియజేశారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో వ్యవసాయ రంగంలో విశేషంగా దిగుబడిని సాధిస్తున్న 250




పోస్టర్ ఆవిష్కరిస్తున్న లావు రత్తయ్య, లావు శ్రీకృష్ణదేవరాయలు

మంది అభ్యుదయ రైతు దంపతులను ఎంపిక చేసి సంక్రాంతి సంబరాల్లో భాగంగా పురస్కారాలు అందచేస్తామని వీసీ చెప్పారు.గోడ పత్రిక ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

## కన్నా స్కూల్లో గ్రీన్ కలర్ డే వేడుకలు

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక రైలుపేటలోని కన్న ఇంగ్లీషు మీడియం హైస్కూల్లో గ్రీన్ కలర్‌డే వేడుకలు నిర్వహించారు. ఆకుపచ్చ రంగు ప్రాధాన్యతను తెలియజేసేలా బాలబాలికలు దుస్తులు ధరించి, ఆకుకూరలు, కూరగాయలు, పండ్లతో వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించటంతో పాటు ఉపన్యాసాలు, నృత్యరూపకాలు, ప్రదర్శించారు. ఈ సందర్భంగా స్కూల్ డైరెక్టర్ డాక్టర్ కన్నా మాస్టర్ మాట్లాడుతూ శాస్త్ర, సాంకేతిక అభివృద్ధి పేరుతో పర్యావరణానికి హానిచేసే విధంగా ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాలు పర్యావరణ సమతుల్యతను దెబ్బతిస్తున్నాయని చెప్పారు. సమస్త మానవాళితోపాటు సకల జీవచరాలను కాపాడుతున్న పర్యావరణంలో భాగమైన చెట్లను పెంచటం వల్ల కలిగే ప్రయోజనాల గురించి విద్యార్థులను చైతన్యపరిచారు. విద్యార్థులే స్వయంగా తల్లిదండ్రులు ఉపాధ్యాయుల సహకారంతో గ్రీన్‌కలర్‌డే కార్యక్రమాలను రూపొందించుకొని




గ్రీన్‌కలర్‌డే వేడుకల్లో విద్యార్థులతో కన్న మాస్టారు


ప్రదర్శించటం ద్వారా పర్యావరణం ప్రాధాన్యతపై వారి చైతన్యాన్ని, ఆసక్తిని తెలియజేస్తుందన్నారు. క్యాంపస్ ఇన్చార్జిలకు మొక్కలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీదేవి, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## 21 మందికి రూ.38.20 లక్షల సిఎంఆర్‌ఎఫ్ నిధులు

అందచేసిన ఎమ్మెల్యే రామాంజనేయులు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

వివిధ ఆరోగ్య సమస్యలతో ప్రైవేట్ హాస్పిటల్ లో వైద్యం చేయించుకున్నటువంటి 21 మంది లబ్దిదారులకు సిఎం రిలీఫ్ నుంచి మంజూరు అయిన సాయంకు సంబంధించిన చెక్కులను ప్రత్తిపాడు శాసన సభ్యులు బూర్ల రామాంజనేయులు మంగళవారం అందచేశారు. మొత్తం రూ.38.20 లక్షలు మంజూరు అయ్యాయని ఆయన తెలిపారు. తెలుగుదేశం పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి అయినటువంటి కర్నాటి సైదా రావు కరోనా సమయంలో బ్లాక్ ఫంగస్ తో వైద్యం చేయించుకుంటూ చనిపోతే వారి కుటుంబానికి రూ.12,09,700 మంజూరు చేసి వారికి ఆర్థికంగా చేయూతనిచ్చామన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే



రామాంజనేయులు తన కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ వివిధ ఆరోగ్య సమస్యలతో బాధపడుతూ వారికి ఆరోగ్యపరంగా జరిగే నష్టం పూడ్చలేక పోయినా వారి కుటుంబ సభ్యులను ఆదుకోవాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి సహాయనిధి నుండి వారికి ఆర్థిక సాయం అందచేశామన్నారు. అంతకు ముందు గుంటూరు రూరల్ మండలంలో ఆయన పలువురు లబ్ధిదారులకు సామాజిక ఫించన్లు అందచేశారు.

## పింఛన్లు పంపిణీ చేసిన గళ్లా మాధవి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి : గుంటూరులో ఎమ్మెల్యే గల్లా మాధవి మంగళవారం పలు ప్రాంతాల్లో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ చేశారు. 20 వ డివిజన్ లోని నల్లచెరువు 19వ లైన్‌లో లబ్దిదారుల ఇంటికి నేరుగా వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. గళ్ళా మాధవి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ లో 1వ తేది వచ్చినది అంటే వద్ధుల,వితంతువులు ఇతర పెన్షన్ లబ్దిదారుల ఇళ్ళలో పండగ వాతావరణం నెలకొంటుందన్నారు. పెన్షన్ దారుల కళ్ళలో ఆనందం చూడటమే కూటమి లక్ష్యమని, గతంలో మాదిరిగా 1వ తేది ఆదివారం వస్తే ఒక రోజు ముందే పంపిణి చేశామని, అయితే ఆదివారం కాకపోయిన కొత్త సంవత్సరాన్ని ఆనందంగా జరుపుకోవాలనే లక్ష్యంతో ఒక రోజు ముందుగానే పెన్షన్ల పంపిణికి ఎన్డీయే కూటమి ప్రభుత్వము శ్రీకారం చుట్టిందన్నారు. టిడిపి నాయకులు సింహాద్రి కనకాచారి, రబ్బాని,తన్నేరు కష్ణ,కొలసాని బాలకష్ణ, మొహమ్మద్ రఫీ,సయ్యద్ ఆదాంసా,టెంట్ హౌస్ బాబు తదితరులు పాల్గొన్నారు.